RNI NO.TELTEL/2023/12249

# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 69 | పేజీలు : 08 | మంగళవారం | 17-03-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.

విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. • సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

Dr. RAHUL KUMAR 9989834020

K. Naveen Kumar 94406 53413



## ఈనెల 30 వరకు తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

2

- ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు
- ఈ నెల 19న ఉగాది సందర్భంగా సభకు సెలవు
- మార్చి 20న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మల్లు భట్టి



## దేశంలో కొరత లేదు

*దేశంలో వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత లేదు: కేంద్ర ప్రభుత్వం ప్రకటన*

2

- అన్ని రాష్ట్రాలలో ఎల్పీజీ స్టాక్ ఉందన్న కేంద్ర ప్రభుత్వం
- గృహ వినియోగదారుల కోసం 100 శాతం స్టాక్ ఉందన్న కేంద్రం
- హర్మూజ్ జలసంధి వద్ద భారత నౌకలు క్షేమంగా ఉన్నాయని వెల్లడి
- ఎల్పీజీ క్యారియర్ నౌక శివాలిక్ సాయంత్రం భారత్ చేరుకుంటుందని వెల్లడి



## పార్టీ మారుతున్నట్టు ప్రచారం

2

మాజీ మంత్రి మల్లారెడ్డి స్పందన

- ఏ నిర్ణయం తీసుకోవాలో తనకు తెలుసన్న మల్లారెడ్డి
- కాంగ్రెస్ మునిగిపోయే నావ లాంటిదన వ్యాఖ్య
- తన పెళ్లి రోజు వేడుకలకు ఆహ్వానించేందుకే రేవంత్ రెడ్డిని కలిశానని వెల్లడి




## భారత్‌కు భారీ ఊరట..

క్షేమంగా ముంద్రా పోర్టుకు చేరుకున్న ఎల్పీజీ ట్యాంకర్ 'శివాలిక్'

2

- హార్ముజ్ అడ్డంకిని అధిగమించి భారత్ ‌ చేరుకున్న ఎల్పీజీ ట్యాంకర్
- ఖతార్ నుంచి బయలుదేరిన శివాలిక్ ఎల్పీజీ ట్యాంకర్ గుజరాత్‌కు చేరిక
- 45,000 టన్నుల గ్యాస్‌తో సురక్షితంగా వచ్చిన నౌక
- రేపు కాండ్లా పోర్టుకు రానున్న మరో నౌక 'నందా దేవి'
- పర్షియన్ గల్ఫ్‌లో భారత నావికులందరూ సురక్షితమన్న కేంద్రం



## వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడాం

2

- హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడాం: తెలంగాణ గవర్నర్
- విజన్ 2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్ మ్యాప్ రూపొందించామన్న గవర్నర్
- రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరిందని ప్రకటన
- మహాలక్ష్మి పథకంతో రూ.9,222 కోట్లు ఆదా అయ్యాయని వెల్లడి

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడామని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. శ్రమించేతత్వం కలిగిన తెలంగాణ ప్రజలందరికీ శుభాకాంక్షలు అని ఆయన ప్రసంగాన్ని ప్రారంభించారు. ప్రజాకేంద్రీకృత పాలన ప్రభుత్వం విధానమని అన్నారు....



## ఎమ్మెల్యేలకు సీఎం క్లాస్

- అనవసర విషయాలు మాట్లాడవద్దని సూచన
- అసెంబ్లీకి అన్ని విధాలుగా సిద్ధమై రావాలన్న సీఎం
- ఎమ్మెల్యేలకు సమయం ఇవ్వాలని మంత్రులకు సూచన

2

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకున్నారు. పలువురి తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సీఎల్పీ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో, బయట అనవసర విషయాలు మాట్లాడవద్దని సూచించారు. సభకు అన్ని విధాలుగా ప్రిపేర్ అయి రావాలని అన్నారు. బయట చిట్‌చాట్‌లు మానివేయాలని అన్నారు.ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలోని సమస్యలను చెప్పుకోవడానికి మంత్రులు వారికి సమయం ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యేలు చెప్పే సమస్యలకు స్పందించాలని అన్నారు. ఇక



ఆవిష్కరించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

2

## తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ

- తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్, మల్లు భట్టి, పలువురు మంత్రులు
- ఈ విగ్రహం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి నిదర్శనమన్న రేవంత్

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

తెలంగాణ శాసనసభ ఆవరణలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర గౌరవానికి, సంస్కృతికి ప్రతీకగా నూతనంగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిలతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



2

## పొట్టి శ్రీరాములు విగ్రహం ఆవిష్కరణ

విగ్రహాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు

- తుళ్లూరు సమీపంలో 58 అడుగులు పొట్టి శ్రీరాములు విగ్రహం ఆవిష్కరణ
- పొట్టి శ్రీరాములు 58 రోజుల ఆమరణ దీక్షకు గుర్తుగా విగ్రహం
- 6.8 ఎకరాల్లో రూ. 150 కోట్ల వ్యయంతో స్మృతివనం ఏర్పాటు

**హైదరాబాద్ పల్స్,అమరావతి**

ఏపీ రాజధాని అమరావతిలో ఒక మహోన్నతమైన ఘట్టం ఆవిష్కృతమైంది. తెలుగు జాతి ఆత్మగౌరవానికి, ప్రాణత్యాగానికి నిలువుటద్దంగా నిలిచిన అమరజీవి పొట్టి శ్రీరాముల 125వ జయంతి సందర్భంగా తుళ్లూరు సమీపంలోని శాఖమూరు పార్కు సమీపంలో 58 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన 58 రోజుల ఆమరణ దీక్షకు





2

## నేపాల్‌లో చుక్కలను అంటుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు!

- లీటర్ పెట్రోల్ రూ.188.. డీజిల్ లీటర్ కు రూ.196
- ఒక్కరోజులోనే పెట్రోల్‌పై రూ.31, డీజిల్‌పై రూ.54 పెంపు
- రూ.2,100 దాటిన వంట గ్యాస్ సిలిండర్ ధర
- హర్మూజ్ జలసంధి మూసివేతే ఇంధన సంక్షోభానికి మూలం

**హైదరాబాద్ పల్స్,డెస్క్**

పశ్చిమాసియాలో చెలరేగుతున్న యుద్ధ సెగలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను దహించివేస్తున్నాయి. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కాస్తా ప్రపంచ ఇంధన సంక్షోభానికి దారితీయడంతో, మన పొరుగు దేశమైన...

## అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్‌ను నిలదీస్తాం

- తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు షురూ
- కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలన్న కేటీఆర్
- వాటికి చట్టబద్ధత కల్పించి తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్
- కాంగ్రెస్ సర్కారు రైతులను, ప్రజలను మోసం చేసిందని విమర్శలు
- "రాహుల్ బంధు కాదు, రైతు బంధు ఇవ్వండి" అనే నినాదంతో పోరాడతామని వెల్లడి



2

**హైదరాబాద్ పల్స్,హైదరాబాద్**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. సోమవారం

## తెలంగాణ గర్వించదగ్గ కవి

2

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు

## అన్నీ అవాస్తవాలు, గందరగోళ మాటలు..

2

గవర్నర్ ప్రసంగంపై బీజేపీ ఎమ్మెల్యే

## రైతుల సమస్యలు పట్టించుకోరా..

2

కాంగ్రెస్ సర్కార్‌పై జీవన్‌రెడ్డి ఫైర్

## ఈనెల 30 వరకు తెలంగాణ బడ్జెట్ సమావేశాలు

**మొదటి పేజీ రువాయి**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నేడు ప్రారంభమయ్యాయి. గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత సభ నేటికి వాయిదా పడింది. అనంతరం జరిగిన బీఏసీ సమావేశంలో బడ్జెట్ సమావేశాలను ఈ నెల 30 వరకు కొనసాగించాలని నిర్ణయించారు.నేడు రేపు గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం, చర్చ ఉంటుంది. ఈ నెల 19న ఉగాది పండుగ సందర్భంగా సభకు సెలవు ఉంటుంది. మార్చి 20న డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.ఈ సమావేశాలు కేవలం బడ్జెట్‌కే పరిమితం కాకుండా, రాజకీయంగా కూడా వాడీవేడిగా సాగే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆరు గ్యారంటీల అమలు, రైతు భరోసా, మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టు, హైదరాబాద్ మెట్రో విస్తరణ వంటి అంశాలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసే అవకాశం ఉంది.

## దేశంలో కొరత లేదు

**మొదటి పేజీ రువాయి**

వంటగ్యాస్ కొరత ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100 శాతం ఎల్పీజీ గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఎల్పీజీ స్టాక్ గృహావసరాలకు సరిపోయేంత ఉందని తెలిపింది. పెట్రోల్, డీజిల్ కూడా తగినంత అందుబాటులో ఉందని కేంద్రం తెలిపింది. అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టం చేసింది.పర్షియన్ గల్ఫ్ నుంచి బయలుదేరిన శివాలిక్ ఎల్పీజీ క్యారియర్ హర్మూజ్ జలసంధిని దాటి భారతదేశం సమీపానికి చేరుకుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. నేడు సాయంత్రం 5 గంటలకు ఈ క్యారియర్ భారత్ చేరుకునే అవకాశం ఉందని తెలిపింది.పశ్చిమాసియా ప్రాంతంలోని అన్ని భారత నౌకలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. ప్రతి నౌకలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మందితో కూడిన 22 భారతీయ జెండా కలిగిన నౌకలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

## పార్టీ మారుతున్నట్టు ప్రచారం

**మొదటి పేజీ రువాయి**

తెలంగాణ రాజకీయాల్లో తనదైన శైలిలో వార్తల్లో నిలిచే మల్లారెడ్డి మరోసారి హాట్ టాపిక్‌గా మారారు. ఆయన బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారంటూ జరుగుతున్న ప్రచారానికి మల్లారెడ్డి నేడు అసెంబ్లీ వద్ద క్లారిటీ ఇచ్చారు."నా వయసు ప్రస్తుతం 73 ఏళ్లు. ఏ నిర్ణయం ఎప్పుడు తీసుకోవాలో నాకు బాగా తెలుసు. మునిగిపోయే పడవలో ఎవరైనా ఎక్కుతారా? కాంగ్రెస్ పార్టీ ఒక మునిగిపోయే నావ లాంటిది. సీఎం రేవంత్ రెడ్డి 11 ఏళ్లు కాదు, 50 ఏళ్లు సీఎంగా ఉంటామన్నా ఆ పార్టీ మునిగిపోయే పడవే" అంటూ ఆ పార్టీలో చేరికను కొట్టిపారేశారు. ఇటీవల తన పెళ్లి రోజు వేడుకలకు ఆహ్వానించేందుకే రేవంత్ రెడ్డిని కలిశానని ఆయన స్పష్టం చేశారు.మరోవైపు, మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి తాజాగా చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఆమె ప్రధాని మోదీ నాయకత్వాన్ని, కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలను ప్రశంసించడంతో పాటు, హైదరాబాద్ పేరును 'భాగ్యనగర్'గా మార్చాలన్న బీజేపీ డిమాండ్‌ను సమర్థించారు. ఈ క్రమంలో మల్లారెడ్డి కుటుంబం కాంగ్రెస్ వైపు కాకుండా బీజేపీ వైపు చూస్తోందా? అనే కొత్త చర్చ మొదలైంది. గతంలో ఆమె బీజేపీ అగ్రనేత బండి సంజయ్‌ను కలవడం కూడా ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది.

## వేల కోట్ల ప్రభుత్వ ఆస్తులను కాపాడాం

**మొదటి పేజీ రువాయి**

విజన్ 2047 ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్ మ్యాప్ రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలకు చేరుకుందని తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ మోడల్ ద్వారా రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. పట్టణాభివృద్ధికి క్యూర్ మోడల్‌ను అనుసరిస్తున్నామని అన్నారు. 2031 నాటికి పట్టణ జనాభా 53.8 శాతానికి చేరుకుంటుందని అంచనాలు ఉన్నట్లు తెలిపారు.ప్రతి పౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని గవర్నర్ తెలిపారు. ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. జీహెచ్ఎంసీని ఇటీవల మూడు కార్పొరేషన్లుగా, హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని 4 కమిషనరేట్లుగా విభజించినట్లు తెలిపారు. బయో ఆసియా సదస్సు ద్వారా రాష్ట్రానికి రూ.1,700 కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు.ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ గమ్యస్థానంగా కొనసాగుతోందని అన్నారు. ఐటీ ఎగుమతులు రూ.3.13 లక్షల కోట్లకు చేరుకున్నాయని తెలిపారు. ఈ రంగంలో 9.39 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయని అన్నారు. గత సంవత్సరం వర్షాకాలంలో రూ.8,744 కోట్లు రైతు భరోసా కింద ఇచ్చామని వెల్లడించారు. పంట రుణమాఫీ కోసం రూ.20,616 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. సాగునీటి రంగానికి కూడా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కొత్తగా తమ ప్రభుత్వం 15.12 లక్షల రేషన్ కార్డులు ఇచ్చిందని, 3.38 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు.ఉచిత బస్సు ప్రయాణ పథకం మహాలక్ష్మి ద్వారా మహిళలకు రూ.9,222 కోట్లు ఆదా అయ్యాయని అన్నారు. స్వయం సహాయక బృందాలకు లక్ష కోట్ల రూపాయల రుణాలను అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఈగల్ ప్రత్యేక సంస్థ ద్వారా డ్రగ్ సమస్యలను నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. నియామక బోర్డులను సంస్కరించినట్లు తెలిపారు. 67,763 మందికి ఉద్యోగాలు ఇచ్చినట్లు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించామని గవర్నర్ తెలిపారు.

## పొట్టి శ్రీరాములు విగ్రహ ఆవిష్కరణ

**మొదటి పేజీ రువాయి**

గుర్తుగా ఈ విగ్రహాన్ని సరిగ్గా 58 అడుగుల ఎత్తులో రూపొందించడం విశేషం. ఈ వేడుకలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, టీజీ భరత్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.సుమారు 6.8 ఎకరాల విస్తీర్ణంలో రూ.150 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ 'స్మృతివనం'లో కేవలం విగ్రహమే కాకుండా, ఒక మ్యూజియం, ఆడిటోరియం, ఫొటో గ్యాలరీని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పొట్టి శ్రీరాముల త్యాగ ఫలమే నేటి ఆంధ్ర రాష్ట్రమని, ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో ఈ 'త్యాగ విగ్రహాన్ని' (ర్ఛీబవ శీట ుఱఎతీఱటఱఎవ) ప్రతిష్టించడం ద్వారా ఏపీ చరిత్రలో ఈ రోజు చిరస్థాయిగా నిలిచిపోనుంది.

## తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ

**మొదటి పేజీ రువాయి**

పాల్గొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని ప్రతిబింబించేలా ఈ విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ప్రతిష్టించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముందు గవర్నర్, ముఖ్యమంత్రి, ఇతర నేతలు అసెంబ్లీ ఆవరణలోని మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్ద ఘనంగా నివాళులర్పించారు. దేశానికి వారు అందించిన గొప్ప సేవలను స్మరించుకున్నారు. విగ్రహావిష్కరణ అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, ఈ తెలంగాణ తల్లి విగ్రహం కేవలం ఒక రూపం మాత్రమే కాదని, ఇది కోట్లాది మంది తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, పోరాట స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు.

## నేపాల్‌లో చుక్కలను అంటుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు!

**మొదటి పేజీ రువాయి**

నేపాల్‌లో పెట్రో ధరలు రాత్రికి రాత్రి రికార్డు స్థాయికి చేరాయి. నేపాల్ ఆయిల్ కార్పొరేషన్ తీసుకున్న సంచలన నిర్ణయంతో ఈ రోజు నుంచి పెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయి.

**భారీగా పెరిగిన ధరలు..**

అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం, సరఫరా వ్యవస్థలో అంతరాయాల కారణంగా నేపాల్ ప్రభుత్వం ఇంధన ధరలను భారీగా సవరించింది. పెట్రోల్ లీటరుకు రూ.31 పెరగడంతో ఇప్పుడు రూ.188 కి చేరింది. డీజిల్ ఏకంగా రూ.54 పెరగడంతో లీటరు ధర రూ.196 కి చేరుకుంది. ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.296 భారం పడటంతో, ఇప్పుడు ఒక్కో బండ ధర రూ.2,126 కు పెరిగింది.

**యుద్ధమే అసలు కారణం..**

ఫిబ్రవరి 28న ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణం తర్వాత పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్ఠకు చేరాయి. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన 'హర్మూజ్ జలసంధి' గుండా నౌకల రాకపోకలు నిలిచిపోవడంతో అంతర్జాతీయంగా ముడి చమురు కొరత ఏర్పడింది. ఈ ప్రభావం నేరుగా దిగుమతులపై ఆధారపడే నేపాల్ వంటి దేశాలపై పడింది. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో తమకు నిరంతరాయంగా ఇంధనాన్ని సరఫరా చేస్తున్న 'ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్'కు నేపాల్ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. భారత్ లో ప్రస్తుతానికి ధరలు స్థిరంగా ఉన్నప్పటికీ సరిహద్దు దాటితే మాత్రం పెట్రో మంటలు సామాన్యుడిని బెంబేలెత్తిస్తున్నాయి.

## అసెంబ్లీ సమావేశాల్లో కాంగ్రెస్‌ను నిలదీస్తాం

**మొదటి పేజీ రువాయి**

నాడు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా, అసెంబ్లీకి వెళ్లేముందు ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి గన్‌పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తక్షణమే అమలు చేయాలని, వాటికి చట్టబద్ధత కల్పించాలని, బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటుకు ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు నివాళులర్పించడం తమ పార్టీకి సంప్రదాయమని కేటీఆర్ గుర్తుచేశారు.అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, ప్రజలను మోసం చేసిందని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రైతులను పట్టించుకోకుండా రాహుల్ గాంధీ కోసం రూ.1000 కోట్లు కేటాయించేందుకు ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని ఆరోపించారు. "రాహుల్ బంధు కాదు, రైతు బంధు ఇవ్వండి" అనే నినాదంతో తాము పోరాడతామని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో పంట వేయకముందే రైతు బంధు నిధులు అందేవని, ఇప్పుడు పంట కోతలు పూర్తవుతున్నా ప్రభుత్వ సాయం అందడం లేదని మండిపడ్డారు.అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, తొలి కేబినెట్‌లోనే చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా గ్యారెంటీలకు చట్టపరమైన భద్రత కల్పించలేదని విమర్శించారు. గతంలో గవర్నర్ ప్రసంగంలోనూ ఈ హామీ ఇచ్చినా, ప్రభుత్వం ఆ మాట నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. బలహీన వర్గాలకు ఐదేళ్లలో రూ.1 లక్ష కోట్లు కేటాయిస్తామన్న హామీపైనా స్పష్టత లేదని అన్నారు. ఈ అంశాలన్నింటినీ అసెంబ్లీలో ప్రస్తావించి, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని కేటీఆర్ హెచ్చరించారు.

## తెలంగాణ గర్వించదగ్గ కవి

**మొదటి పేజీ రువాయి**

ప్రముఖ తెలంగాణ కవి, రచయిత నందిని సిధారెడ్డికు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2025 వచ్చిన నేపథ్యంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నందిని సిధారెడ్డిని అభినందిస్తూ కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నందిని సిధారెడ్డి దీర్ఘ కవితా సంపుటి 'అనిమేష', కరోనా సమయంలో ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాన్ని, ముఖ్యంగా మానవ సంబంధాల విచ్ఛిన్నతలను హృద్యంగా చిత్రీకరించడం ద్వారా ఈ అవార్డు పొందడం గొప్ప విషయమని తెలిపారు.

**తెలంగాణకు గర్వకారణం..**

ఈ సందర్భంగా నందిని సిధారెడ్డిపై ప్రశంసల వర్షం కురిపించారు. తెలంగాణ మట్టివాసన తెలిసిన కవి నందిని సిధారెడ్డి అని పేర్కొన్నారు. తన సాహిత్యం తెలంగాణ జీవితాన్ని అక్షరబద్ధం చేసిందని, తెలంగాణ ప్రజలకు గర్వకారణంగా నిలిచిందని చెప్పుకొచ్చారు. నందిని సిధారెడ్డి తెలంగాణ గర్వించదగ్గ కవి మాత్రమే కాక, మానవ సంబంధాలు, సామాజిక సమస్యలు, ప్రజల జీవిత అనుభవాలను సృజనాత్మకంగా చిత్రించే ప్రతిభావంతమైన రచయిత అని కేసీఆర్ అభిప్రాయపడ్డారు.

**మంజీరా రచయితల సంఘం..**

మెదక్ జిల్లాకు కేంద్రంగా ఏర్పాటైన మంజీరా రచయితల సంఘం ద్వారా నందిని సిధారెడ్డి అన్నివర్గాల ప్రజల సమస్యలు, సామాజిక సమానత్వం కోసం రచనలు చేశారని కేసీఆర్ తెలిపారు. తన కలను, భావాలను కవిత్వ రూపంలో ప్రజల ముందుకు తీసుకొచ్చారని అన్నారు. ఇది తెలంగాణ ప్రజలకు ఆలోచనాత్మక మార్గదర్శకత్వం ఇచ్చే ప్రయత్నంగా, సామాజిక చైతన్యాన్ని పెంపొందించే విధంగా ఉందని కేసీఆర్ తెలిపారు.

**ఉద్యమ కవిగా తెలంగాణ సాధనలో ప్రతిభ..**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో నందిని సిధారెడ్డి పాటలు, కవిత్వం ద్వారా ప్రజలను ఆలోచింపజేసి, ఉద్యమ కవిగా ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు. కవిత్వం, సాహిత్యం ద్వారా సామాజిక చైతన్యానికి ప్రేరణ కలిగించారని అన్నారు. ప్రజల జీవితాల అనుభవాలను అక్షరబద్ధం చేయడం వంటి అంశాలను కేసీఆర్ ప్రత్యేకంగా హైలైట్ చేశారు.

**కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు..**

భారతీయ సాహిత్య ప్రపంచంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అత్యున్నతమైనదని కేసీఆర్ తెలిపారు. ప్రతి సంవత్సరం భారతీయ భాషల్లో ప్రసిద్ధ రచయితలకు, వారి సాహిత్య కృషికి ప్రతిఫలంగా ఈ అవార్డు ఇస్తారని చెప్పుకొచ్చారు. నందిని సిధారెడ్డి 'అనిమేష' ద్వారా సాహిత్య రంగంలో చేసిన విశిష్టమైన కృషికి ఈ అవార్డు పొందడం తెలంగాణ సాహిత్య ప్రపంచానికి గొప్ప ఘనత అని కేసీఆర్ అభిప్రాయపడ్డారు.

## రైతుల సమస్యలు పట్టించుకోరా..

**మొదటి పేజీ రువాయి**

జగిత్యాల: అన్నదాతల సమస్యలను పట్టించుకోవడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కజొన్న పంట కొనుగోళ్లలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆగ్రహించారు. రైతుల పంటకు తగిన ధర దక్కకపోవడం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మొక్కజొన్నను మద్దతు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జగిత్యాల పట్టణంలో రైతులు ఈరోజు(సోమవారం) పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి జీవన్‌రెడ్డి నాయకత్వం వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన మొక్కజొన్న రైతులు తమ సమస్యలను ప్రభుత్వానికి తెలపడానికి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. రైతుల చేతుల్లో ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేస్తూ తమ ఆందోళన వ్యక్తం చేశారు. ర్యాలీ అనంతరం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. మొక్కజొన్న పంటకు తగిన ధర ఇవ్వాలని, వెంటనే ప్రభుత్వం కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

**కొనుగోళ్లలో జాప్యం చేస్తున్న ప్రభుత్వం..**

మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని జీవన్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతులు పంట పండించి మార్కెట్‌కు తీసుకువస్తే ప్రభుత్వం సరైన విధంగా కొనుగోళ్లు చేయడం లేదని ఫైర్ అయ్యారు. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు మధ్యవర్తుల చేతిలో నష్టపోతున్నారని పేర్కొన్నారు. మార్కెట్లో ధరలు తగ్గిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల నుంచి మొక్కజొన్నను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

**మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు చేయాలి..**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో మంచి వ్యవస్థ ఉండేదని జీవన్‌రెడ్డి ప్రస్తావించారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి మొక్కజొన్నను కొనుగోలు చేసేవారని గుర్తుచేశారు. అలాగే గత పదేళ్లలో కూడా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళు జరిగినట్లు తెలిపారు. అయితే కాంగ్రెస్ సర్కార్‌లో ప్రస్తుతం ఆ విధానం సరిగా అమలు కావట్లేదని విమర్శించారు. ప్రభుత్వం మళ్లీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ప్రారంభిస్తే రైతులకు ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు.

**తీవ్ర నష్టాల్లో మొక్కజొన్న రైతులు..**

జగిత్యాల జిల్లాలో పెద్ద ఎత్తున మొక్కజొన్న సాగు జరుగుతుందని జీవన్‌రెడ్డి తెలిపారు. అయితే ఈసారి పంటకు సరైన ధర లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పంటను పండించడానికి రైతులు ఎరువులు, విత్తనాలు, నీటి ఖర్చుల కోసం అప్పులు చేసి సాగు చేస్తారని, కానీ మార్కెట్లో ధరలు తక్కువగా ఉండటంతో వారికి పెట్టుబడులు కూడా తిరిగి రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లు ఆలస్యం కావడంతో రైతులు తమ పంటను నిల్వ చేయలేక తక్కువ ధరకు అమ్మాల్సి వస్తోందని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

**మద్దతు ధర ఇవ్వాలి..**

ప్రభుత్వం మద్దతు ధరకు పంటను కొనుగోలు చేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. పండించిన పంటకు కనీస ధర లభించకపోతే రైతన్నలు ఆర్థికంగా కుంగిపోతారని తెలిపారు. అన్నదాతల పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతన్నల నుంచి నేరుగా మొక్కజొన్న కొనాలని ప్రభుత్వాన్ని జీవన్ రెడ్డి కోరారు.

## ఎమ్మెల్యేలకు సీఎం క్లాస్

**మొదటి పేజీ రువాయి**

నుంచి తాను కూడా ఎమ్మెల్యేలకు సమయం ఇస్తానని ముఖ్యమంత్రి అన్నారు. సభలో ప్రతిపక్షాల ప్రతి అంశానికి కౌంటర్ ఇవ్వాలని సూచించారు.ఇప్పటి సీఎల్పీ సమావేశానికి ఆరుగురు సభ్యులు రాలేదని ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని అసహనం వ్యక్తం చేశారు. ఆరోగ్య సమస్యలు ఉంటే మాత్రం మినహాయించవచ్చని పేర్కొన్నారు. అసెంబ్లీకి ప్రతి ఒక్కరు హాజరు కావాల్సిందే అని స్పష్టం చేశారు. తాము ప్రవేశపెట్టనున్న ఈ బడ్జెట్ ఇన్నోవేటివ్‌గా ఉంటుందని, విద్య, వైద్యంకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు.సభలో మాట్లాడే సమయంలో విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. బీఆర్ఎస్ హయాంలో జానారెడ్డి, మల్లు భట్టివిక్రమార్కలకు కూడా మైక్ ఇవ్వని సందర్భాలు ఉన్నాయని, కానీ తాము ప్రతిపక్షాలకు మాట్లాడే సమయం ఇస్తున్నామని అన్నారు.రాజకీయాల్లో మాట్లాడే మాటల వల్ల వ్యక్తిగత డ్యామేజీ ఏమో కానీ, వ్యవస్థపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు పార్టీ, ప్రభుత్వం లైన్‌లోనే స్పందించాలని సూచించారు.

## భారత్‌కు భారీ ఊరట..

**మొదటి పేజీ రువాయి**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, భారత్‌కు ఇంధన సరఫరా విషయంలో భారీ ఊరట లభించింది. ఖతార్ నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్పీజీ)తో బయలుదేరిన 'శివాలిక్' అనే భారత నౌక, అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని దాటి సోమవారం సాయంత్రం 5 గంటలకు గుజరాత్‌లోని ముంద్రా పోర్టుకు సురక్షితంగా చేరుకుంది. ఈ నౌకలో సుమారు 45,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ ఉంది.ప్రభుత్వ రంగ సంస్థ అయిన షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన 'శివాలిక్', 'నందా దేవి' అనే రెండు నౌకలు కలిపి మొత్తం 92,700 మెట్రిక్ టన్నుల ఎల్పీజీని భారత్‌కు తీసుకువస్తున్నాయి. శివాలిక్ ఇప్పటికే తీరానికి చేరుకోగా, 'నందా దేవి' అనే మరో ట్యాంకర్ రేపు ఉదయం గుజరాత్‌లోని కాండ్లా పోర్టుకు రానుంది. ఈ విషయాన్ని కేంద్ర నౌకాశ్రయాలు, షిప్పింగ్ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ కుమార్ సిన్హా ధృవీకరించారు.పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో పనిచేస్తున్న భారత నావికులందరూ సురక్షితంగా ఉన్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని సిన్హా స్పష్టం చేశారు. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధికి పశ్చిమాన 22 భారత నౌకలు ఉన్నాయని, వాటిలో 611 మంది సిబ్బంది ఉన్నారని తెలిపారు. వీటితో పాటు, యూఏఈ నుంచి సుమారు 81,000 టన్నుల ముడిచమురుతో వస్తున్న 'జగ్ లాడ్కీ' నౌక కూడా ముంద్రా పోర్టుకు వస్తోందని, ఆ నౌకలోని సిబ్బంది కూడా క్షేమంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు.ప్రపంచంలోని చమురు, గ్యాస్ ఎగుమతుల్లో దాదాపు 20 శాతం హోర్ముజ్ జలసంధి గుండానే జరుగుతాయి. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతల నేపథ్యంలో, అధికారులు నౌకల కదలికలను నిశితంగా గమనిస్తూ, షిప్పింగ్ లైన్లకు అవసరమైన మద్దతును అందిస్తున్నారు.

# పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

## పోలీస్ అధికారులు, కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ తో ఏర్పాటు చేసిన సమావేశంలో - జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్.హెచ్.ఓ లు, కోర్టు డ్యూటీ ఆఫీసర్లతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు. న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ పాత కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు తమ అధికారులకు తెలియజేస్తూ ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు తలెత్తితే డీసిఆర్బీ అధికారులకు తెలియజేసి వాటిని నివృత్తి చేసుకోవాలని తెలిపారు. కేసు నమోదయినప్పటి నుండి పరిష్కారం అయ్యే వరకు ప్రతీ విషయాన్ని ఆన్లైన్లో పొందుపరిచాలని టెక్ టీం ఆపరేటర్లకు సూచించారు. ఆన్లైన్లో పొందుపరిచే క్రమంలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఐటి సెల్ సహకారం తీసుకోవాలని అన్నారు. 5ఎస్ అమలులో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కేసులకు సంభందించిన ఫైళ్ళను క్రమపద్ధతిలో అమర్చుకోవాలని సూచించారు. నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేసి బాధితులకు న్యాయం చేకూర్చడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి, ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు, డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు



# జిల్లా ఎస్సీ సబ్సిడీ రుణాలకు ఆహ్వానం

## మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి కలెక్టర్ అంకిత్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు తద్వారా ఆర్థిక పురోగతి పెంపొందించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్యచరణ ప్రణాళిక 2025-26 ప్రకటించింది. ఈ పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాలకు చెందిన యువతీ, యువకులు ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక 2025- 26 సంవత్సరానికి గాను బ్యాంకు ద్వారా సబ్సిడీ రుణాల కొరకు ఇవి టూ వీలర్, ఇవి త్రీ వీలర్ సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, ఐ.ఏ.ఎస్. ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మొత్తం 276 యూనిట్ల గాను రూ.265.28 లక్షల సబ్సిడీతో ప్రణాళికలు తయారు చేసి రూ 1 లక్ష వరకు గాను 90% సబ్సిడీ, రూ.2 లక్షల గాను 80% సబ్సిడీ, రూ. 2 లక్షల నుండి రూ.4 లక్షల వరకు 70% సబ్సిడీతో రూ.4 లక్షలు ఆపైన ఎంచుకోదగిన పథకాలకు 60% సబ్సిడీతో బ్యాంకుల ద్వారా రుణాలను అందజేస్తారని తెలిపారు. స్వయం ఉపాధి పథకాలను ఎంచుకునే వారికి 21 నుండి 50 సంవత్సరాలు లోపు వయసు ఉండాలని వ్యవసాయ అదారిత పథకాలను ఎంచుకునే వారికి 21 నుండి 60 సంవత్సరాలు వయసు ఉండాలని పేర్కొన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.1,50,000 పట్టణ ప్రాంతం వారికి రెండు రూ.2,00,000 మించకుండా ఉండాలని పేర్కొన్నారు. కావున అర్హత ఆసక్తి గల అభ్యర్థులు టి జి ఓ బిఎంఎంఎస్ ఆన్లైన్ పోర్టల్ ద్వారా ఆధార్ కార్డు, రేషన్ కార్డు ,పాస్ ఫోటో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రములు, శాశ్వత డ్రైవింగ్ లైసెన్సు ,సదరం సర్టిఫికేట్ అంగవైకల్యం కోటాలో అర్హత కొరకు పట్టాదార్ పాస్ పుస్తకం సౌరశక్తి సోలార్ పంప్ సెట్ కొరకు కనీసం 2 ఎకరాల భూమి కలిగి ఉండాలి బోర్వెల్ నీటి సదుపాయము కలిగి ఉన్న విధంగా పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరించాలి. ఈవి టూ వీలర్ వాహనాల కోసం ఎస్సీ వ్యవస్థాపకులు గిగ్ కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది అన్నారు జొమాటో, స్విగ్గి, రాపిడో, ఊబర్ వంటి క్లైమ్ చేయడానికి సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు దగ్గర్లో ఉన్న మీసేవ కేంద్రం నందు దరఖాస్తు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ నమోదు ప్రక్రియ మార్చ్ 17 నుండి 24 మార్చి వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అట్టి నమోదు చేసిన ఆన్లైన్ అప్లికేషన్ ఫామ్ హార్డ్ కాపీలని రూం నెంబర్ ఎస్ 1, రెండవ అంతస్తు ఎస్సీ కార్పొరేషన్ ఆఫీస్, ఐ డి ఓ సి కార్యాలయం నందు సమర్పించాలని వారు తెలిపారు.




# ఇరాన్పై అమెరికా, ఇజ్రాయెల్లది యుద్ధోన్మాదం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
ఇరాన్పై అమెరికా, ఇజ్రాయెల్లది యుద్ధోన్మాదమని, ఈ చర్యలు ప్రపంచ శాంతిని తీవ్రంగా విచ్ఛిన్నం చేస్తున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా విమర్శించారు. దేశవ్యాపిత నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బస్టాండు సెంటర్లో మానవహారం చేపట్టి ఖాళీ సీలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ ప్రపంచ దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నా కేంద్రం మౌనం వహించడం శోచనీయమని, అమెరికా ఒత్తిళ్లకు లొంగి కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. భారత ప్రభుత్వ ఆహ్వానం మేరకు నావికా విన్యాసాలకు వచ్చి వెళుతున్న ఇరాన్ నౌకను దేశ సముద్ర తీరంలో అమెరికా కూల్చివేస్తే కేంద్ర ప్రభుత్వం కనీసం ఖండించకపోవడం సిగ్గుచేటని, 160 మంది పిల్లలను బలి తీసుకున్నప్పుడు అమెరికా ఒత్తిడితో మాట్లాడకుండా మోకరిల్లడం దేశ సార్వభౌమాధికారానికి భంగకరమని విమర్శించారు. దేశ ప్రయోజనాలను అగ్రరాజ్యానికి తాకట్టు పెడుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతో సామాన్యుడిపై ధరల భారం పెరుగుతోందని, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి సామాన్యుల వంటింటిపై మోయలేని భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నా కేంద్రం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ సామాన్యుడి నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, ధరల పెరుగుదలను నియంత్రించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సామ్రాజ్యవాద దేశాలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న కుట్రలను ప్రపంచ దేశాలన్నీ ఏకమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, కందుల భాస్కర్, భూక్యా శ్రీనివాస్, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు ఎం ధనలక్ష్మి, కె రత్నకుమారి, నిర్మల, గోపి కృష్ణ, పి ధనలక్ష్మి, ధర్మరాజు, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, ఆకాంక్ష, వాడే రాములు, మంద నాగలక్ష్మి, సత్యనారాయణాచారి, విజయలక్ష్మి, యూసుఫ్, షాహీన్, కైసర్, అబ్బులు, రాకేష్, సింగిరాల రమేష్, లక్ష్మీనారాయణ, మండల రాజు తదితరులు పాల్గొన్నారు




# ఏపీ జల దోపిడీకి రేవంత్ రెడ్డి సహకారం: హరీశ్ రావు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16, సిటీ బ్యూరో:** కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరుగుతోందని ఇంత జరుగుతున్నా సీఎం రేవంత్ రెడ్డి మౌనంగా ఉంటున్నారని మాజీ మంత్రి హరీశ రావు విమర్శించారు. తెలంగాణకు రేవంత్ రెడ్డి చేస్తున్న ద్రోహంపై మేం అనేక సార్లు గళమెత్తామన్నారు. బ్యక్ టేడ్ వేసి ఉత్తరాలు రిలీజ్ చేస్తున్నారని ఆరోపించారు. ఇవాళ అసెంబ్లీ మీడియా హాల్ వద్ద మాట్లాడిన ఆయన.. గోదావరి జలాల్లో ఏపీ దోపిడీకి సిద్ధమవుతోందని తెలంగాణకు శాశ్వతంగా నష్టం చేసేలా సీడబ్ల్యూసీ చర్యలు ఉన్నాయన్నారు. జనవరి 30న జరిగిన సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మీటింగ్ మినిట్స్ పై ప్రభుత్వం స్పందించకండా నిద్రపోతోందని ఆరోపించారు. రాష్ట్రాల మధ్య గోదావరి జలాల పంపిణీనే జరగలేదని ఈ మినిట్స్ లో చెప్పారన్నారు. రేవంత్ రెడ్డి అండ చూసుకునే ఏపీ రెచ్చిపోతందని అన్నారు.

# భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఉత్సవాల్లో ఆదర్శ్ రెడ్డి



**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16 :**
అమీన్పూర్ డివిజన్ పరిధిలోని జానకంపేట్ గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వి. ఆదర్శ్ రెడ్డి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఆదర్శ్ రెడ్డి కి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జానకంపేట్ మాజీ సర్పంచ్ పండు యాదవ్, కిష్టారెడ్డిపేట్ మాజీ సర్పంచ్ కృష్ణ, వడిగేపల్లి మాజీ సర్పంచ్ మల్లేష్, బీఆర్ఎస్ యువ నాయకులు మాణిక్ యాదవ్, సాయి కృష్ణ, శివలాంటి స్థానిక నాయకులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థినీలకు అవగాహన



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో సోమవారం అగ్ని ప్రమాదాలపై ప్రదర్శన పూర్వక విద్యార్ధినీలకు అవగాహనను కల్పించారు. అగ్ని ప్రమాదాలను నివారించడం ఎలా, ప్రమాదాల నుండి కాపాడుకునే పద్ధతులను ప్రదర్శించి చూపారు. ప్రధానోపాధ్యాయులు ఆకుల వేణుగోపాల్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ అబ్దుల్ హమీద్, సిబ్బంది మల్లికార్జున్, హరీష్ రెడ్డి, కరుణాకర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మైరా లక్ష్మిక పుట్టినరోజు సందర్భంగా నిరుపేద కుటుంబాలకు అన్నదానం నిర్వహించిన మాజీ ఎంపీటీసీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ మామిడాల అనిత మాజీ ఎంపిటిసి మామిడాల అంజయ్య మనమరాలు మామిడాల మైరా లక్ష్మిక మొదటి పుట్టినరోజు సందర్భంగా శ్రీ సోమేశ్వర ఆలయ ప్రాంగణంలో అభిషేకాలు, పూజలు, నిర్వహించి అనంతరం జైన్ మందిర్ ఆవరణలో కేకును కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబాలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మామిడాల శ్రీవాణి - ప్రశాంత్, పవన్, నిమ్మల హరిలత, శంకర్, సాత్విక, తదితరులు పాల్గొన్నారు



## రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చిన బి ఆర్ ఎస్ నాయకులు.



**హైదరాబాద్ పల్స్ న్యూస్,మార్చు 16, రాజపేట:** మండల కేంద్రమైన రాజపేటలోని మసీదులో పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు, బిఆర్ఎస్ నాయకులు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సటు తిరుమలేష్, మండల బిఆర్ఎస్ నాయకులు ఎర్రగోకుల జశ్వంత్, పాల సంఘం మాజీ చైర్మన్ కాకర్ల ఉపేందర్, పార్టీ పట్టణ అధ్యక్షులు బెడిదే వీరేశం, 9వ వార్డు సభ్యురాలు చలిమిడి రేవతి వెంకటేష్, బిఆర్ఎస్ నాయకులు చేల్మిడీ వెంకటేష్, ఎండి జాంగిర్, తాయాబలి, గోరేమియా, ఆటో అచ్చు, అహ్మద్, పైయాను, ఎండి కాజా, మొదలగువారు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

## ట్రంపు విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపిన భారత కమ్యూనిస్టు పార్టీ




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చు 16, రాజపేట:** మండల కేంద్రమైన రాజపేటలోని గాంధీ చౌరస్తాలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంపు విధానాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రపంచంలో అమెరికా పెద్దన్న పాత్ర పోషించి ప్రపంచం మీద దాడులు చేస్తూ సామ్రాజ్యవాదాన్ని విస్తరించడానికి ఇరాన్ పైన దౌర్జన్యంగా అణుబాంబుల పేరుతోటి దాడులు చేస్తుందన్నారు. ఇటువంటి దాడులను ప్రపంచవ్యాప్తంగా ఖండిస్తున్నామన్నారు. ఐక్యరాజ్యసమితి కూడా యుద్ధాన్ని ఆపండి శాంతియుతంగా సమస్యను పరిష్కారం చేసుకుందామని తెలిపిన కూడా వినకుండా బాంబులు, మిస్సైల్ దాడులు, గల్ఫ్ ప్రాంతంలో చేయడం, వంటి విధానాలను ఖండిస్తున్నామని, ఈరోజు భారతదేశము,కూడా యుద్ధాన్ని ఆపండి, శాంతిని కాపాడండి, అని భారత ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చొరవ తీసుకుని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలను ఖండించాలని, ఇందులో భాగంగా భారత కమ్యూనిస్టు పార్టీ దేశవ్యాప్తంగా నిరసనలు తెలియజేస్తున్నామని, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొల్లూరు రాజయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మూల పోచయ్య, ఇంజ హేమలత, రైతు సంఘం నాయకులు ఒగ్గు కరుణాకర్, మహిళా సంఘం నాయకురాలు చంద్రకళ, చల్లూరు గ్రామ శాఖ నాయకులు నరసింహ, బొంధుగుల కమ్యూనిస్టు పార్టీ నాయకులు గొల్లూరి రాములు, కార్మిక సంఘం నాయకులు తరిగొప్పుల సిద్దులు, హమాలీ సంఘం అధ్యక్షులు దయ్యాల సిద్ధులు, ఉచ్చంతల బాలయ్య, మూలా హరినాథ్, నంద మల్లేశం మొదలగువారు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రిలే దీక్షలకు కేటీఆర్ మద్దతు కోరిన రాష్ట్ర చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు..... వనం శాంతి కుమార్.



**హైదరాబాద్ పల్స్ న్యూస్,మార్చి 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి:** మాజీ మంత్రివర్యులు, భారత రాష్ట్ర సమితి తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,మరియు సిరిసిల్ల శాసన సభ్యులు, కల్వకుంట్ల తారక రామారావుని వారి నివాసంలో కలిసి,చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మార్చి 23,24,25 తేదీలలో ఇందిరా పార్కు, హైదరాబాద్ లో జరిగే రిలే నిరాహార దీక్షా శిభిరంను సందర్శించి సౌహార్ధ సందేశం ఇచ్చి చేనేత కార్మిక సంఘం రిలే నిరాహార దీక్షలకు మద్దత్తు ఇవ్వవలసినదిగా తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు వనం శాంతి కుమార్ కార్యదర్శి ముషం నరహరి విజ్ఞప్తి చేశారు.వారు సానుకూలంగా స్పందించారని తెలియజేశారు.తప్పకుండా రిలే నిరాహార దీక్షా శిభిరంనకు వస్తామని హామీ ఇచ్చారనీ తెలియజేశారు.

## నిషేధిత జాబితాలో ఉన్నా ఇండ్లను వెంటనే తొలగించాలి : సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట, రిజిస్ట్రేషన్ల చట్టం 22-ఎ, పిఓటి యాక్ట్ 1908 లో భాగంగా రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో సర్వే నెం. 276,277,278,308,245, 250 లో ఉన్నటువంటి దాదాపు 239 నివాస గృహాలను ఎలాంటి క్రయ విక్రయాలు జరపకుండా నిషేధిత ఆస్తుల జాబితా ( ప్రొహిబిటెడ్ ప్రాపర్టీస్ )లో చేర్చారని వెంటనే తొలగించాలని సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 70 సంవత్సరాల క్రితం స్థలాలను కొనుగోలు చేసి లక్షల రూపాయలు వెచ్చించి భవనాలను నిర్మించుకోవడం జరిగిందని ఈరోజు అకస్మాత్తుగా అవన్నీ కూడా ప్రభుత్వ స్థలాలని వాటిని ఎవరు కూడా క్రయ విక్రయాలు జరపకుండా అవసరానికి ఏ ఒక్క బ్యాంకు కూడా లోన్స్ మంజూరు చేయకుండా నిషేధించడాన్ని తీవ్రంగా ఖండించారు. తద్వారా ఆ ఇంటికి ఎలాంటి విలువ లేకుండా వారందరూ కూడా నష్టపోయేటువంటి అవకాశం ఉందని, వెంటనే వాటిని నిషేధిత జాబితా నుండి తొలగించాలని లేనిపక్షంలో బాధితుల తరఫున బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని అవసరమైతే త్వరలోనే బాధితులందరినీ కలుపుకొని ఎమ్మార్వో, జిల్లా కలెక్టర్ ను కూడా కలిసి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు కొండం రాజు, మాజీ సర్పంచ్ రామిళ్ళ నరేందర్, వార్డ్ మెంబర్లు తుంగ అక్షయ్ కుమార్, తుంగ సతీష్, పార్టీ సీనియర్ నాయకులు నల్ల అశోక్, కలకుంట్ల పోచయ్య, బింగి బాలరాజు, ఆర్కే ప్రభాకర్, కటకం వెంకటేశం, ఉప్పల సిద్ధిలింగం, శెట్టి శ్రీరాములు, బత్తిని పరుశురాం, ఉపాధ్యక్షులు బత్యం కనకరాజు, బొద్దుల శ్రీకాంత్, బొట్టు భాను, సంగిశెట్టి అనిల్, కటకం పృథ్వీరాజ్, ఎడ్ల శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధి హామీని...నిర్వీర్యం చేస్తున్న కేంద్ర సర్కార్!


**‹ పూజ్య మహాత్మా గాంధీ పేరును తొలగించడం సిగ్గుచేటు.**

**‹ సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆంక్షా రెడ్డి.**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16, సిద్దిపేట జిల్లా :** గ్రామీణ ప్రాంత కూలీలు, నిరుపేద రైతుల కడుపు నింపుతున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్రశీ లోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూశీకుంట అంక్షారెడ్డి విమర్శించారు. వర్గల్, తునికి ఖల్సా, తునికి మక్త, మీనాజీపేట్, శాకారం, అంబర్ పేట గ్రామాల్లో సోమవారం ఉపాధి హామీ కూలీలతో విధానసభలు ఏర్పాటు చేసి ఆమె మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని పేరు మార్చాలనే దుర్బుద్ధితో... విబిజి రాంజీ పేరుతో కేంద్ర నిధుల్లో కోత విధించి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర సర్కార్ 40 శాతం నిధులు సమకూర్చాలని పేర్కొంటున్నట్లు ఎద్దేవా చేశారు. వ్యవసాయ కూలీలు, కార్మికుల హక్కులు, వ్యవసాయ అనుబంధ పనులు తొలగించి జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా రద్దు చేయాలని కుట్ర చేస్తున్నట్లు ఆరోపించారు. అయితే నిరుపేద రైతులు, వ్యవసా కూలీలు, గిరిజనులు, కార్మికుల ఉపాధి కరువైన సందర్భంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని చేపట్టి కడుపునిండా భోజనం పెట్టినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమాన్ని రద్దు చేయాలనే లక్ష్యంతో ఉన్న కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తూ ఉపాధి హామీ కూలీలతో విధాన సభలు, సమావేశాలు నిర్వహించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, మండల కాంగ్రెస్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, సర్పంచులు, ఉప సర్పంచ్లు విజయలక్ష్మి యాదగిరి, కొండగళ్ల గణేష్, కుమార్ యాదవ్, కుమార్, గోరెమియా, టేకులపల్లి గోవర్ధన్ రెడ్డి, గంగుమల్ల లక్ష్మి, సహదేవ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షులు పంజాల సాయి గౌడ్, నేతలు గంగుమల్ల కొండల్ రెడ్డి, నీల శ్రీనివాస్, పాషా భాయ్, యాదగిరి, పొన్నాల నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## నగరం నడిబొడ్డున దారుణం.. ఆరేళ్ల బాలికపై అత్యాచారం, హత్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16, సిటీ డెస్క్:** హైదరాబాద్ నగర శివారులోని నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత అమానవీయ ఘటన చోటుచేసుకుంది. చాక్లెట్ ఇప్పిస్తానంటూ నమ్మించి ఆరేళ్ల బాలికపై ఓ కామాంధుడు అత్యాచారం చేసి, ఆపై కిరాతకంగా హత్య చేసిన ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. స్థానికంగా నివసించే ఆరేళ్ల బాలిక ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు రాత్రి 10 గంటల ప్రాంతంలో నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు.

సీసీ కెమెరా దృశ్యాలతో చిక్కిన నిందితుడు..

పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించగా, ఓ దుండగుడు బాలికను తన వెంట తీసుకెళ్తున్న దృశ్యాలు స్పష్టంగా రికార్డయ్యాయి. ఆ ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేశానని, ఆపై గొంతు నులిమి హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. రాత్రి ఒంటి గంట ప్రాంతంలో నిందితుడు చూపించిన చోటే బాలిక మృతదేహం లభ్యమైంది. పోలీసులు బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. నిందితుడిపై హత్య, పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పసిపాపపై జరిగిన ఈ అఘాయిత్యం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని బాధితురాలి కుటుంబ సభ్యులు, కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ చల్లగా ఉండాలి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**





**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16 :** మల్లన్న స్వామి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని జానకంపేట గ్రామంలో సోమవారం నిర్వహించిన శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం, జాతర కార్యక్రమంలో ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ సర్పంచ్ పాండు, స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


## ఉద్యమ నేత ఎలిమినేటి కృష్ణారెడ్డి ని కలిసిన తంగళ్ళ పల్లి శ్రీవాణి రవికుమార్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** మాజీ ఎమ్మెల్సీ తెలంగాణ ఉద్యమ నేత ఎలిమినేటి కృష్ణారెడ్డి ని భువనగిరి నూతన మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన తంగళ్ళ పల్లి శ్రీవాణి రవికుమార్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది ఈ సందర్భంగా వారి ఆరోగ్య బాగోగులు తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఎలిమినేటి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కరప్షన్, కబ్జాలు లేని ఎలాంటి అవినీతి కి తావివ్వకుండా భువనగిరి ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి నాయకత్వంలో భువనగిరి మున్సిపాలిటీ అభివృద్ధి పదంలో నడపాలని కోరారు



# లీప్ స్పేస్ పై గీతంలో శిక్షణ

## ప్రధాన వక్తగా : ఎల్సెవియర్ కస్టమర్ సక్సెస్ మేనేజర్ శివాలికా వర్మ





**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని విజ్ఞాన వనరుల కేంద్రం (కే.ఆర్.సీ. లేదా గ్రంథాలయం) ఆధ్వర్యంలో సైన్స్ డైరెక్ట్ ఏఐ సాధనం, లీప్ స్పేస్ పై ఒకరోజు ఆన్ లైన్ శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పరిశోధకుల పండిత సాహిత్యాన్ని మరింత సమర్థవంతంగా కనుగొని, విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు.ఎల్సెవియర్ కస్టమర్ సక్సెస్ మేనేజర్ శివాలికా వర్మ ఈ కార్యక్రమంలో ప్రధాన శిక్షకురాలిగా వ్యవహరించారు. అధునాతన సాహిత్య ఆవిష్కరణ, పరిశోధన అంతర్దృష్టులు, విద్యా సహకారం కోసం సైన్స్ డైరెక్టర్ ఏఐ ఆధారిత ప్లాట్ ఫామ్ లీప్ స్పేస్ ను ఉపయోగించడంపై ఆమె ఆచరణాత్మక మార్గదర్శకత్వాన్ని అందించారు.ఇందులో భాగంగా, లోతైన పరిశోధన అంతర్దృష్టులను రూపొందించడానికి స్కోపస్ డేటా, సైన్స్ డైరెక్టర్ పూర్తి-టెక్స్ట్ వనరులను ఈ సాధనం ఎలా ప్రభావితం చేస్తుందో ఆమె వివరించారు. అంశాలను అన్వేషించడం, నిపుణులను కనుగొనడం, నిధుల లభ్యత వంటి కీలక అంశాలు ఈ శిక్షణలో ఉన్నాయి. ఇవి పరిశోధకులు వర్ధమాన పరిశోధనా రంగాలను అన్వేషించడానికి, అలాగే సహకార, నిధుల అవకాశాలను గుర్తించడానికి వీలు కల్పిస్తాయి.అంశాల అన్వేషణలో భాగంగా, సాలిడ్-స్టేట్ బ్యాటరీ టెక్నాలజీలో పరిణామాలు, మానవ ఆరోగ్యంపై మైక్రోప్లాస్టిక్ ల ప్రభావం చుట్టూ తలెత్తుతున్న ప్రశ్నలు, సీఆర్ఐఎస్పీఆర్ జన్యు సవరణలో ఇటీవలి పురోగతులు, చర్చలు వంటి ప్రస్తుత పరిశోధనాంశాలను ఆమె వివరించారు.జనరేటివ్ ఏఐ భద్రత, పీఎఫ్ఏఎస్ కాలుష్యం, నివారణ, అలాగే భారీ భాషా నమూనాల (ఎల్ఎల్ఎం) మూల్యాంకన పరిశోధన వంటి రంగాలలో అగ్రశ్రేణి రచయితలు, పరిశోధకులను గుర్తించడంపై శివాలికా మార్గనిర్దేశం చేశారు.వ్యవసాయంలో ప్రారంభ దశ పీఎఫ్ఏఎస్ పరిశోధనకు మద్దతు ఇచ్చే సంభావ్య గ్రాంట్లను, మైక్రోప్లాస్టిక్స్, మానవ ఆరోగ్యంపై అధ్యయనాలు, ఓపెన్ సైన్స్, పరిశోధన మౌలిక సదుపాయాలను ప్రోత్సహించే చొరవలను గుర్తించడంలో పరిశోధకులకు సహాయపడే 'ఫైండ్ ఫండింగ్ ఫీచర్'ను కూడా ఆమె వివరించారు.తొలుత, గీతం చేపడుతున్న పరిశోధనా ప్రాజెక్టులకు ఎల్స్ వియర్ ఎలా మద్దతు ఇస్తోందీ ఆ సంస్థకు చెందిన ప్రణవ్ శుక్లా వివరించారు. గీతంలోని వివిధ విభాగాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. కే.ఆర్.సీ. డైరెక్టర్ ఎస్.పి.ఏ. బాలసుబ్రమణియన్, ఉప గ్రంథపాలకుడు కె. రామకృష్ణల పర్యవేక్షణలో ఈ ఆచరణాత్మక ఆన్ లైన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, సహాయ గ్రంథపాలకుడు కె. దుర్గాప్రసాద్ సమన్వయం చేశారు.

# ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ

- ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి నిర్వహణ..
- సమస్యల పరిష్కారానికి సంబంధిత ఎస్.హెచ్.ఓలకు తక్షణ ఆదేశాలు.
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపిఎస్.



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16, సంగారెడ్డి ప్రతినిధి:** ప్రజల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి (గ్రీవెన్స్ డే) కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలతో వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత అంశాలపై ఎస్. హెచ్. ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్‌లలో సమస్యలు పరిష్కారం కాకపోతే ఎలాంటి భయాలు లేకుండా జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

# ఎల్పీజీ సరఫరాపై ఆందోళన వద్దు..వినియోగదారులకు కేంద్రం భరోసా

**హైదరాబాద్ పల్స్ న్యూస్ మార్చ్ 16, ఢిల్లీ:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల ఎల్పీజీ సరఫరాలో కొంత క్లిష్టత ఉన్నప్పటికీ, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది. దేశవ్యాప్తంగా గ్యాస్ పంపిణీ సజావుగా సాగేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ సోమవారం వెల్లడించారు.ఈ క్లిష్ట సమయంలో ఎల్పీజీ నిల్వలు పెంచుకోవడం (హోర్డింగ్), బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడటం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. సరఫరాపై ఒత్తిడిని తగ్గించేందుకు వినియోగదారులు పైపుల వంట గ్యాస్ వైపు మొగ్గు చూపాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఇందుకోసం ఐజీఎల్, మహానగర్ గ్యాస్ లిమిటెడ్ వంటి సంస్థలు ఉచిత గ్యాస్, రిజిస్ట్రేషన్ ఛార్జీల మాఫీ వంటి ప్రత్యేక ప్రోత్సాహకాలను ప్రకటించాయని ఆమె వివరించారు.ప్రస్తుతం దేశంలో ఎక్కడా ఎల్పీజీ కొరత లేదని, డీలర్ల వద్ద నిల్వలు నిండుకున్నట్లు (డ్రై-అవుట్) ఎలాంటి నివేదికలు అందలేదని అధికారులు స్పష్టం చేశారు. మార్చి 13న గరిష్టంగా 88.8 లక్షల రీఫిల్ బుకింగ్‌లు నమోదవగా, మార్చి 15 నాటికి అవి 50-55 లక్షలకు తగ్గాయని, అయితే ఇది కేవలం ఆదివారం సెలవు వల్ల జరిగిన మార్పు కావచ్చని అభిప్రాయపడ్డారు.డిజిటల్ బుకింగ్‌ల వాటా 90 శాతానికి పెరగడం సానుకూల పరిణామమని, వినియోగదారులు క్యూలలో నిలబడకుండా ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అక్రమాలను అరికట్టేందుకు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా సహా పలు రాష్ట్రాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, సుమారు 1,100 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఎక్కడైతే పైప్‌లైన్ నెట్‌వర్క్ అందుబాటులో ఉందో, అక్కడ వినియోగదారులు వెంటనే పీఎన్‌జీ కనెక్షన్లు తీసుకోవాలని అధికారులు కోరారు



# నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా "బేటీ జన్మోత్సవం"

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16, నారాయణఖేడ్:** నారాయణఖేడ్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, మహిళా సాధికారతకేంద్రం సహకారంతో బేటీ జన్మోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో పుట్టిన ఆడ శిశువులను గౌరవిస్తూ బేటీ జన్మోత్సవ కిట్లు మరియు ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. బాలిక జననాన్ని ఆనందంగా జరుపుకోవడం ద్వారా సమాజంలో బాలికల పట్ల గౌరవం మరియు ప్రోత్సాహం పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా "బేటీ బచావో బేటీ పడావో" పథకం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అలాగే పని చేసే ప్రదేశాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపులను నివారించేందుకు అమలు చేస్తున్న "పోష్ చట్టం" గురించి కూడా వివరించారు. మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండి అవసరమైన సమయంలో చట్టపరమైన సహాయం పొందాలని సూచించారు. అదేవిధంగా "బేటీ జన్మోత్సవం" సందర్భంగా ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి మాట్లాడుతూ, బాలికల రక్షణ, విద్య మరియు సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న "బేటీ బచావో బేటీ పడావో" కార్యక్రమం ఎంతో ముఖ్యమని తెలిపారు. బాలిక పుట్టినప్పటి నుండి ఆమెకు సమాన అవకాశాలు కల్పించడం ద్వారా వారి భవిష్యత్తు మరింత మెరుగుపడుతుందని చెప్పారు. సమాజంలో బాలికల పట్ల వివక్ష లేకుండా అందరూ సమానంగా చూడాలని ఆమె కోరారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలు మరియు మహిళలకు అవసరమైన వైద్య సేవలు, రక్షణ మరియు ఇతర సదుపాయాలను సమయానికి అందిస్తున్నామని తెలిపారు.మహిళల ఆరోగ్యం మరియు శిశువుల సంరక్షణ తమ ప్రధాన బాధ్యతగా భావిస్తూ అన్ని విధాలుగా సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఖేడ్ ఐసిడిఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సుజాత మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన పోషకాహారం, గర్భధారణ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, అలాగే చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. పిల్లలను క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వారి ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రీజినల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనురాధ, నారాయణఖేడ్ సబ్ ఇన్‌స్పెక్టర్ మొగులయ్య, కానిస్టేబుల్, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.






# తమ్ముడి మృతికి కారణమైన అన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16, సిద్దిపేట :** తమ్ముడి మృతికి కారణమైన అన్నను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ మేరకు సీఐ ఉపేందర్ వివరాలు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారండ సిద్దిపేట పట్టణంలోని బోయగల్లి ప్రాంతానికి చెందిన వంగలి రాములు, వంగలి ప్రభు, వంగలి కొండాలు అన్నదమ్ములు. వీరికి సంబంధించిన పాత ఇంటి విషయంలో వివాదం నెలకొంది. ఆ ఇంటిని తన పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వంగలి కొండాలు, మిగతా ఇద్దరికి డబ్బులు చెల్లించినట్లు తెలిసింది. అయితే డబ్బులు తీసుకున్నప్పటికీ వంగలి రాములు ఇంటిని కొండాలు పేరుమీద మార్చేందుకు సంతకం చేయకుండా వేధింపులకు గురి చేసినట్లు తెలిపారు. అదే సమయంలో అమ్మమ్మకు చెందిన 60 గజాల స్థలాన్ని ఎవరికి తెలియకుండా వంగలి రాములు తన భార్య చంద్రకళ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ విషయమై కొండాలు ప్రశ్నించగా రాములు, అతని భార్య చంద్రకళ అతడిని తిట్టి అవమానించినట్లు తెలిపారు. ఈ అవమానాన్ని తట్టుకోలేక వంగలి కొండాలు 2026 ఫిబ్రవరి 15న పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. ఈ ఘటనపై వంగలి ప్రభు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వంగలి రాములు, అతని భార్య చంద్రకళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

# శ్రీ స్వామి వారి చెంత పంచాంగానికి ప్రత్యేక పూజలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట లోని శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ముద్రించిన నూతన సంవత్సరం 2026 - 27 శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగం కు సోమవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి, కొండపైన గల శ్రీ పర్వత వర్ధిని రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు,, స్పటిక లింగం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు చేసారు. పూజలు అందుకున్న అనంతరం అర్చక స్వాములు మంగవెల్లి సాందీపని కి ఆలయ నిర్వాహకులు పంచాంగం అందజేశారు. అంతకుముందు 13వ తేదీన రాజపేటలో శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయ పూర్వ ప్రధాన అర్చకులు నల్లన్ తీగల్ లక్ష్మీనరసింహాచార్యులు విజయలక్ష్మి పుణ్య దంపతుల చేతుల మీదుగా పంచాంగం ఆవిష్కరణ జరిగింది. పంచాంగ ముద్రణ శైలి నీ పరిశీలించిన పుణ్య దంపతులు ప్రత్యేకంగా అభినందించారు. ఆలయ శాశ్వత గౌరవాధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్, ట్రస్టు అభివృద్ధి సేవా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ప్రత్యేక శ్రద్ధతో ముద్రించిన పంచాంగం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

# బిఎసి సమావేశంలో ముఖ్యమంత్రి, మంత్రులతో కలసి పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** హైదరాబాద్ లోని అసెంబ్లీ లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాంబర్ లో బీఎస్సీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మల్లు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా కిట్ పంపిణీ చేసిన సర్పంచ్ గొలుసుల అనూష యాకూబ్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట రంజాన్ మాసం పురస్కరించుకొని ముస్లిం సోదరులకు బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో ముస్లిం సోదరుల కుటుంబాలకు సోమవారం రంజాన్ తోఫా కిట్ పంపిణీ కార్యక్రమం రాజపేట మండలం సోమారం గ్రామంలో గ్రామ సర్పంచ్ గొలుసుల అనూష యాకూబ్, ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముస్లిం కుటుంబ సభ్యులు మహమ్మద్ బషీర్, అంక్షావలి, జహంగీర్, బీర్ల ఐలయ్య కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగా శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బొమ్మకంటి జంపయ్య గౌడ్, మహిళా సంఘం గ్రామ అధ్యక్షురాలు పుప్పాల పద్మ, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంగ యాదగిరి, గిరిరాజు స్వామి, బురద సురేష్, బండ నరేష్, తవిటి బాలరాజ్, చౌదరిపల్లి శ్రీనివాస్, తమ్ముడి వంశీధర్,జంగ శేఖర్, పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డికి అసెంబ్లీ సమావేశాలకు స్వాగతం పలికిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్ర 8వ అసెంబ్లీ సమావేశాలకు హాజరైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పుష్పగుచ్చం అందజేసి సమావేశాలకు స్వాగతం పలికారు. అనంతరం జాతీయగీత ఆలాపన తర్వాత నిర్వహించిన గవర్నర్ ప్రసంగంలో పాల్గొన్నారు.

# చాట్‌జీపీటీని అధిగమించిన 'ఇండియన్ ఆయిల్ వన్'




ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చెందిన ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ యాప్ ఇండియన్ ఆయిల్ వన్ గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ స్టోర్‌లలో అగ్రస్థానంలో నిలిచి సరికొత్త రికార్డును సృష్టించింది. ఈ జాబితాలో కొంతకాలకంగా ఓపెన్‌ఏఐకి చెందిన చాట్‌బాట్ చాట్‌జీపీటీ అగ్రస్థానంలో కొనసాగుతోంది.ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో వంట గ్యాస్ ధరలు పెరుగుతాయని, దొరకకపోవచ్చనే ఆందోళనలు ప్రజల్లో నెలకొన్నాయి. గృహ వినియోగదారులకు ఎలాంటి వంట గ్యాస్ కొరత లేదని కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రకటిస్తోంది. అయినప్పటికీ పెద్ద ఎత్తున వంట గ్యాస్ బుక్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో డౌన్‌లోడ్‌లలో చాట్‌జీపీటీని ఇండియన్ ఆయిల్ వన్ వెనక్కి నెట్టిందని యాప్ ఎనలిటిక్స్ ప్లాట్‌ఫామ్ సెన్సార్ టవర్ వెల్లడించింది.సిలిండర్ల బుకింగ్, డెలివరీ ట్రాకింగ్, కొత్త కనెక్షన్ తదితర సేవల కోసం ఇండియన్ ఆయిల్ వన్ యాప్‌ను తీసుకువచ్చారు. దేశంలో ప్రస్తుతం ఎల్పీజీ కొరత ఆందోళనల నేపథ్యంలో ఇండియన్ ఆయిల్ వన్ యాప్‌ను పెద్ద ఎత్తున డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. గడిచిన నెల రోజుల్లో 40 లక్షల మంది ఈ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకున్నట్లు సెన్సార్ టవర్ తెలిపింది.

# మాయగాళ్ళకే మాయగాళ్ళు... బైక్ ఫైనాన్సర్లకే చుక్కలు చూపిస్తున్న కేటుగాళ్లు

**ఫైనాన్స్ లో కొనుగోలు కాష్ కి అమ్మకాలు వందల సంఖ్యలో ఘటనలు**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16, అశ్వరావుపేట :** ఇన్ని రోజులు ఫైనాన్సర్లు అప్పు తీసుకున్న వారిని నానా ఇబ్బందులు పెట్టి ముక్కు పిండి అయినా సరే తమ అప్పు వసూలు చేసే వాళ్ళు. లేదా సదరు వాహనం లేదా ఏ వస్తువు అయితే వాళ్ళు రికవరీ పేరుతో లక్కెళ్ళే వారు తన అప్పు కి జమేసుకుని ఫైనాన్స్ వేలం ద్వారా తమ అప్పుకు జమ చేసుకునే వాళ్ళు. కానీ ఇప్పుడు మొత్తం తీరే మారింది, కొందరు మహానుభావులు ఫైనాన్స్ లో వాహనం కొనుగోలు చేసి సదరు వాహనాలను అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు అయితే ఇలా ఒక్కరు కాదండోయ్... వదలకు పైగా సంఘటనలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గ వ్యాప్తంగా జరిగాయానేది అక్షర సత్యమే...

**జూదకారుల చేతివాటం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో ఈమధ్య కొత్త ట్రెండు నడుస్తోంది కొందరు జూదకారులు పేకాట రాయుళ్లు కోడిపందాల జూదకారులు తమ అవసరాల కోసం ఒక ఆలోచన చేశారు. ఓ పదివేలు పెట్టి అశ్వరావుపేటలో పలు సెకండ్ హ్యాండ్ బైక్ ఫైనాన్స్ లలో కన్సల్టెన్సీ లలో వాహనం కొనుగోలు చేసి వాటిని వడ్డీ వ్యాపారస్తుల దగ్గర 50 వేలకు ఆ వాహనానికి ఎంత ధర వస్తే అంత అప్పుగా కొంత మూల్యం సంపాధిచుకుంటున్నారు అనేది ఒక సమాచారం.

**లబో దిబో మంటున్న ఫైనాన్సర్లు**

ఈ ద్విచక్ర వాహన సెకండ్ హ్యాండ్ బైక్ ఫైనాన్సర్లు సదరు వాహనం తీసుకున్న వ్యక్తి నెలలు దాటుతున్న వాహన ఇఎంఐ చెల్లించడం లేదని వాహనదారుని వద్దకు వెళ్లి ఆరా తీయగా అసలు విషయం బయటపడింది అప్పటికే ఆలస్యం కావడంతో ఆ వాహనం తాకట్టు లేద అమ్మకం జరిగిన విషయం తెలుసుకొని అటు కొనుగోలుదారిని అడిగిన పాపనికి కొన్ని ఘర్షణలకు దారి తీసాయాని సమాచారం. పదులకు పైగా ఒక్కో ఫైనాన్స్ కంపెనీ నష్టపోయేసరికి విషయం విలువలోకి వచ్చింది

**ఎక్కువగా సంఖ్యలో జూదకారులు**

ఎక్కువ సంఖ్యలో పందెం రాయుళ్ళే ఉండడం విశేషం. అయితే వాహనం ఐదువేలకు లేదా పదివేలకు డౌన్ పేమెంట్ కట్టి వాహనాన్ని అశ్వారావుపేట లో గల ఓ సెకండ్ హ్యాండ్ ఫైన్సులో కొనుగోలు చేస్తున్నారు తర్వాత ఆ వాహనాన్ని తాకట్టుపెట్టి లేదా అమ్మి వేల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. వందకు పైగా సమస్యలు ఉన్నాయి అనేది అక్షర సత్యం. ఈ విషయాన్ని సదురు ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లు కొనుగోలు చేసిన వ్యక్తిని ఈఎంఐ కట్టమని అడిగితే గొడవలు చేయడం లేదా పంచాయతీలు పెట్టడం కొందరు రాజకీయ నాయకులు జోక్యంతో ఫైనాన్సర్లు నోరుమేధపలేని పరిస్థితి కొందరైతే ఫైనాన్సర్లపై దాడులు చేసినట్లు సమాచారం. మరికొందరైతే ఫైనాన్స్ ఏజెంట్ల పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెడతామని బెదిరింపులు కూడా జరుగుతున్నాయి ఏది ఏమైనప్పటికీ కొన్ని సంఘటనవల్ల కొన్ని కొన్ని ఏరియాలకు వాహనాలు అమ్మాలంటేనే పేటలో ఉన్న కొన్ని కన్సల్టెన్సీలు భయపడుతున్నాయి.

# హార్ముజ్ జలసంధి గుండా ఇరాన్ భారత ట్యాంకర్లను ఎందుకు అనుమతించిందో చెప్పిన భారత విదేశాంగ మంత్రి..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16 :** ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడి తర్వాత మధ్యప్రాచ్యంలో యుద్ధం మొదలైంది. ఇరాన్ హార్ముజ్ జలసంధిని ఆక్రమించుకుంది. ఈ సముద్ర మార్గాన్ని అడ్డుకుంది. అయితే.. టెహ్రాన్ భారత ట్యాంకర్లను ఈ మార్గం గుండా వెళ్ళడానికి అనుమతించిందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు.చర్చలు మాత్రమే ఫలితాలను ఇస్తాయని, అది నిరంతర ప్రక్రియ అని విదేశాంగ మంత్రి అన్నారు. ఫైనాన్షియల్ టైమ్స్‌తో మాట్లాడుతూ.. "నేను ప్రస్తుతం వారితో సంభాషణలో నిమగ్నమై ఉన్నాను, ఈ చర్చలు కొన్ని ఫలితాలను ఇచ్చాయి. ఈ ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది. దీని నుండి ఫలితాలు వస్తున్నట్లు అనిపిస్తే, నేను స్పష్టంగా ఈ చర్చలను కొనసాగిస్తాను" అని అన్నారు."ఖచ్చితంగా భారత్ దృక్కోణం నుండి మనం చర్చించడం, సమన్వయం చేసుకోవడం, పరిష్కారం కనుగొనడం మంచిది" అని ఆయన అన్నారు. భారత జెండా ఉన్న నౌకల కోసం ఇరాన్‌తో సమగ్ర ఒప్పందం లేదని.. నౌకల ప్రతి కదలిక వ్యక్తిగత సంఘటన అని విదేశాంగ మంత్రి స్పష్టం చేశారు. ఇరాన్ కు ప్రతిఫలంగా ఏమీ అందలేదని కూడా ఆయన ఖండించారు. ఢిల్లీ, టెహ్రాన్ లు ఒకదానితో ఒకటి వ్యవహరించే చరిత్ర కలిగి ఉన్నాయని, దాని ఆధారంగానే వారు చర్చలు జరిపారని జైశంకర్ అన్నారు."ఇది మార్పిడికి సంబంధించిన విషయం కాదు. భారత్, ఇరాన్ సంబంధాలు ఉన్నాయి. ఈ సంఘర్షణను మేము చాలా దురదృష్టకరమని భావిస్తున్నాము" అని ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. డాక్టర్ జైశంకర్ మాట్లాడుతూ.. ఇది ప్రారంభం మాత్రమే.. మనవి చాలా నౌకలు ఉన్నాయి.. కాబట్టి, ఇది స్వాగతించదగిన దశ అయినప్పటికీ, చర్చలు ఇంకా కొనసాగుతున్నాయన్నారు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా చోక్‌పాయింట్‌గా మారిన హార్ముజ్ జలసంధి గుండా ద్రవీకృత పెట్రోలియం వాయువును మోసుకెళ్తున్న రెండు భారతీయ జెండా కలిగిన ట్యాంకర్లు సురక్షితంగా వెళ్ళాయి. పర్షియన్ గల్ఫ్ నుండి అరేబియా సముద్రానికి జలసంధి ఏకైక మార్గం.

# దుబాయ్‌కు వెళ్లే అన్ని విమానాలను రద్దు చేసిన ఎయిర్ ఇండియా..!





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16, ఢిల్లీ:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇంతలో, ఎయిర్ ఇండియా సోమవారం దుబాయ్ విమానాలన్నింటినీ రద్దు చేసింది. అయితే, అబుదాబి, రస్ అల్ ఖైమా, షార్జాలకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు యథావిధిగా కొనసాగుతాయి."దుబాయ్‌లో విమాన కార్యకలాపాలు నిలిపివేయబడ్డాయి. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి బయలుదేరే అన్ని విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేశాం. దుబాయ్‌కు బయలుదేరే ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాలు ఈరోజు రద్దు చేయబడ్డాయి..." అని ఎయిర్ ఇండియా ఎక్స్ లో రాసింది.తిరువనంతపురం నుండి దుబాయ్ వెళ్తున్న ఎమిరేట్స్ విమానం సోమవారం భద్రత గురించి సమాచారం అందడంతో వెనక్కి తగ్గింది. దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం మూసివేయబడిన తర్వాత టి.ఆర్.వి-డి.ఎక్స్.బి విమానం మధ్య నుంచే తిరిగి వచ్చింది. విమానం తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగింది. 353 మంది ప్రయాణికులు, 19 మంది సిబ్బందితో కూడిన విమానం ఉదయం 4:40 గంటలకు బయలుదేరి ఉదయం 8:40 గంటలకు తిరిగి వచ్చిందని వారు తెలిపారు. ప్రయాణీకులను టెర్మినల్‌కు తరలిస్తారని వారు తెలిపారు.అంతకుముందు 325 మందితో ఉదయం 4.30 గంటలకు కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి బయలుదేరిన మరో ఎమిరేట్స్ విమానం ఇ.కె 533, దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం అకస్మాత్తుగా మూసివేయబడిన కారణంగా వెనక్కి తిరిగి కొచ్చి విమానాశ్రయంలో దిగింది.దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ సంబంధిత సంఘటన కారణంగా మంటలు చెలరేగాయి. దాడి తర్వాత భద్రతా చర్యగా అనేక రహదారులను తాత్కాలికంగా మూసివేశారు. విమానాశ్రయ రోడ్డు, విమానాశ్రయ సొరంగం ప్రస్తుతానికి మూసివేయబడ్డాయని దుబాయ్ పోలీసులు తెలిపారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని కోరారు. అధికారుల ప్రకారం.. ఈ ప్రాంతంలో అత్యవసర సహాయ, రక్షణ కార్యకలాపాలు జరుగుతున్నాయి, కాబట్టి ట్రాఫిక్‌ను మళ్లించారు.

# ఎం.ఐ.ఎం అసలు రంగు బయటపడింది.. బండి సంజయ్ ఫైర్

**( అసెంబ్లీలో వందేమాతరం గేయం పాడుతుండగా ఎంఐఎం సభ్యుల వాకౌట్ చేయడంపై బండి సంజయ్ మండిపడ్డారు**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16, మెయిన్ బ్యూరో:** శాసనసభలో వందేమాతరం గేయం పాడుతుండగా సభ నుంచి ఎంఐఎం సభ్యులు వాకౌట్ చేయడం రాజకీయంగా దుమారం రేపుతోంది. ఎంఐఎం సభ్యులు సభ నుంచి బయటకు వెళ్లడంపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తాజాగా కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. అసెంబ్లీలో ఎంఐఎం తీరు సరికాదన్నారు. వందేమాతరం పాడుతుండగా వాకౌట్ చేయడం సిగ్గుచేటని జాతీయ గేయానికి, భరతమాతకు ఇది అవమానం అన్నారు. ఈ చర్యతో మస్లిస్ అసలు రంగు బయటపడిందన్నారు.

**తొలిరోజే ఎంఐఎం వర్సెస్ బీజేపీ:**

ఇవాళ్టి నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగా సమావేశాలు మొదలైన తొలిరోజే ఎంఐఎం వర్సెస్ బీజేపీ మధ్య రాజకీయ గలాటా మొదలు కావడం ఆసక్తిగా మారింది. ఎంఐఎం సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బీజేపీ ఇది దేశాన్ని అవమానించడమేనని, ఎంఐఎం సభ్యులపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

# ట్రంప్ కు భారత్ బిగ్ షాక్-హార్ముజ్ పై కీలక నిర్ణయం..!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16, ఢిల్లీ:**
ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి 17 రోజులైపోయింది. యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియదు అనడం కంటే ఇరాన్ ను తక్కువ అంచనా వేసిన అమెరికా-ఇజ్రాయెల్ దీని నుంచి ఎప్పుడు బయటపడతాయన్న చర్చ ప్రస్తుతం అంతర్జాతీయంగా కొనసాగుతోంది. దీంతో పట్టుదలకు పోతున్న ట్రంప్.. ఇరాన్ బ్లాక్ చేసిన హార్ముజ్ జలసంధిని ఎలాగైనా తెరిపించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం తమ మిత్రదేశాల సాయం కోరారు. కానీ అవి స్పందించట్లేదు.ఈ నేపథ్యంలో ఇవాళ భారత్ కూడా హార్ముజ్ జలసంధికి యుద్ధ నౌకల్ని పంపే విషయంలో డొనాల్డ్ ట్రంప్ చేసిన విజ్ఞప్తిపై స్పందించింది. హార్ముజ్ జలసంధి ద్వారా వ్యాపార నౌకలు సురక్షితంగా ప్రయాణించేలా చూసేందుకు నేవీ నౌకలను మోహరించడంపై అమెరికాతో ద్వైపాక్షిక చర్చలు జరపడం లేదని మన విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇవాళ వెల్లడించింది. ఈ ప్రాంతంలో ఉద్రిక్తతల మధ్య వ్యూహాత్మక జలమార్గాన్ని తెరిచి ఉంచడానికి యుద్ధనౌకలను పంపాలని ట్రంప్ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ స్పష్టత ఇచ్చింది.హార్ముజ్ జలసంధిని మూసివేయడానికి ఇరాన్ చేసిన ప్రయత్నం వల్ల ఏర్పడిన కృత్రిమ అడ్డంకుల వల్ల ప్రభావితమైన చైనా, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, యూకే, ఇతర దేశాలు జలమార్గాన్ని సురక్షితంగా, తెరిచి ఉంచడానికి ఆ ప్రాంతానికి తమ యుద్ధనౌకలను పంపుతాయని తాను ఆశిస్తున్నట్లు ట్రూత్ సోషల్‌లో ఒక పోస్ట్‌లో ట్రంప్ తెలిపారు. అయితే, ట్రంప్ పేర్కొన్న దేశాలు వెంటనే ఎటువంటి హామీలు ఇవ్వలేదు.

ఈ నేపథ్యంలో భారత్ కూడా తక్షణం స్పందించేందుకు సిద్ధంగా లేదు. అందుకే ఈ వ్యవహారంపై వేచి చూసే ధోరణి అవలంబించాలని భావిస్తోంది. ఇప్పటికే హార్ముజ్ జలసంధి నుంచి భారత్ నౌకల్ని ఇరాన్ అనుమతిస్తున్న నేపథ్యంలో భారత్ దూకుడు చర్యలకు సిద్ధంగా లేదు.




# మల్లన్న సాగర్ నుండి ఆలేరు నియోజకవర్గానికి సాగునీటిని విడుదల చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** ఆలేరు నియోజకవర్గ రైతాంగ ప్రయోజనాలే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆదివారం సాయంత్రం మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుండి నీటిని విడుదల చేశారు.నియోజకవర్గంలోని చెరువులు, కుంటలను నింపే ప్రక్రియలో భాగంగా బీర్ల ఐలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్. స్వయంగా మల్లన్న సాగర్‌ను సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించి గేట్లను ఎత్తారు. ఆలేరు నియోజకవర్గంతో పాటు పొరుగున ఉన్న ఇతర నియోజకవర్గాల్లోని ఎండిపోయిన చెరువులను నింపడమే లక్ష్యంగా ఈ నీటి విడుదల జరిగింది. నీటి విడుదల సందర్భంగా జల దేవతకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ..."ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఆలేరు నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ఎండకాలంలో రైతాంగం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మల్లన్న సాగర్ నుండి చెరువులను నింపే కార్యక్రమాన్ని చేపట్టాం. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసి, మన నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాం.ఈ నీటి విడుదలతో నియోజకవర్గంలోని భూగర్భ జల మట్టం పెరగడంతో పాటు, వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది.రైతులు ఈ నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను."ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు మరియు నియోజకవర్గ రైతులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తులకు శుభవార్త.. తిరుమల తరహాలో యాదగిరిగుట్టలో కూడా ఆ సేవలు!





**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చ్ 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి:**
ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి క్షేత్రం తరహాలో విస్తృతంగా అభివృద్ధి చెందుతుంది. ఈ ఆలయాన్ని గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని కోట్లాది రూపాయల వ్యయంతో పునర్నిర్మించింది. అత్యంత శోభాయమానంగా ఆలయం నిర్మాణం జరగడంతో యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ని దర్శనం చేసుకోవడానికి భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది.

**తిరుమల తరహాలో యాదాద్రి డిజిటలైజేషన్:**
సాధారణ రోజులలో నిత్యం 50వేల మంది భక్తులు వస్తుండగా, వారాంతాలు, పండుగ దినాలలో లక్ష మందికి పైగా భక్తులు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్నారు.భక్తుల సందర్శన నిర్వహణతో పాటు, ఆలయ పరిపాలనలో పారదర్శకతను పెంచాలన్న లక్ష్యంతో తిరుమల తరహాలో డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. యాదాద్రి ఆలయాన్ని తిరుమల శ్రీవారి తరహాలో, భక్తులకు అందుబాటులోకి తీసుకురావడం కోసం, పూర్తి స్థాయి ఆన్లైన్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని దేవాదాయ శాఖ నిర్ణయం తీసుకుంది.

**త్వరలో డిజిటల్ యాదగిరి:**
ఈ క్రమంలోనే తిరుమలకు సంబంధించిన ఆన్లైన్ అప్లికేషన్స్ అందిస్తున్న టిసిఎస్ ను దేవస్థానం సంప్రదించింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అవసరమైన డిజిటల్ అప్లికేషన్లను అభివృద్ధి చేసి సేవలను అందించడం కోసం టిసిఎస్ అంగీకారం తెలిపింది. ఈ క్రమంలో త్వరలోనే అత్యాధునిక డిజిటల్ సేవలతో డిజిటల్ యాదగిరి అందుబాటులోకి రానుంది.

**అన్ని రకాల సేవలు ఆన్ లైన్ లోనే:**
ప్రస్తుతం ఈ మేరకు డి పి ఆర్ రూపకల్పనకు సంబంధించి సన్నాహాలు మొదలయ్యాయి. యాదాద్రి ఆలయ పరిపాలన నుండి భక్తులకు అందించే వసతుల వరకు అన్ని రకాల సేవలు ఆన్లైన్ ద్వారానే లభిస్తాయి. అంతేకాదు మొత్తం యాదగిరిగుట్ట దేవస్థానం పరిపాలనను పర్యవేక్షించే 14 విభాగాలు కూడా డిజిటలైజేషన్ కానున్నాయి.

**డిజిటల్ పద్ధతిలో నిర్వహించేలా యాప్:**
యాదాద్రికి సంబంధించి కొనుగోలు, టెండర్లు, బిల్లుల చెల్లింపులు, ఉద్యోగుల జీత భత్యాల వంటి ముఖ్యమైన కార్యకలాపాలు కూడా డిజిటల్ పద్ధతిలో నిర్వహించేలా యాప్ ను రూపొందిస్తున్నారు. తిరుమల తరహాలో భక్తులకు మరింత సౌకర్యవంతంగా బ్రేక్ దర్శనాలు, అతి శీఘ్ర దర్శనాలు, ప్రత్యేక దర్శనాలు, ఆలయంలో భక్తులు జరిపించుకునే అన్ని రకాల ఆర్జిత సేవలు ముందుగానే ఆన్లైన్లో పొందే విధంగా రూపొందిస్తున్నారు.

**తెలంగాణాలో కొత్త సర్వే.. నిరుపేదలకు శుభవార్తనే!:**
రాబోయే ఆరు నెలలలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి ధర్మ దర్శనానికి కూడా స్లాట్ విధానం అమలులోకి తీసుకురావాలని, అవసరమైతే దానికి సైతం అప్లికేషన్స్ సిద్ధం చేయాలని భావిస్తున్నారు. తిరుమల తరహాలో యాదాద్రి ఆలయానికి సంబంధించిన ప్రతి సేవ ఆన్లైన్లో అందుబాటులోకి వచ్చేలా ప్లాన్ చేశారు. డిజిటల్ యాదగిరి ఆన్లైన్ సేవల ద్వారా వసతి ఇతర సదుపాయాల సమాచారం కూడా భక్తులకు వేగంగా ప్లాన్ చేస్తున్నారు. ఈ సేవలు రాబోయే ఆరు నెలలలో పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

# లోక్ అదాలత్ ద్వారా అధిక కేసుల పెండింగును తగ్గించటమే లక్ష్యం

## యాదాద్రి జూనియర్ సివిల్ జడ్జి చండీశ్వరి దేవి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** యాదగిరిగుట్ట జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎ. జయరాజు వారి సూచనలమేరకు, సంస్థ కార్యదర్శి వి.మాధవి లత యాదాద్రి జూనియర్ సివిల్ జడ్జి కోర్టును సందర్శించి బార్ అసోసియేషన్ అధ్యక్షులు మరియు న్యాయవాదులు, పోలీసు యంత్రాంగముతో యాదాద్రి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు హాలులో సమావేశం ఏర్పాటు చేసి వారితో మాట్లాడుతూ ఈనెల మార్చిలో 28వ తేది శనివారం రోజున నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ లో అధిక కేసుల పరిష్కారానికై తగిన చర్యలు తీసుకోవాలని, యాదాద్రి కోర్టు పరిధిలో అత్యధిక కేసులు పెండింగులో ఉన్నందున అధిక మొత్తములో రాజీ పడదగు కేసులును పరిష్కరించేలా న్యాయవాదులు, పోలీసువారు పూర్తి సహకారం అందచేయాలని, దీనికై పోలీసు యంత్రాంగం ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి రాజీకి ఆమోదయోగ్యమైన అన్ని కేసులలో లోక్ అదాలత్ నోటీసులు అందించేలా చర్యలు తీసుకోవాలని, ప్రి సిట్టింగ్స్ ద్వారా కేసులలోని ఇరుపక్షాల మధ్య రాజి కుదిరించవచ్చుని, ఈ వెసులుబాటును



కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఈ లోక్ అదాలత్ నిర్వహణపై కోర్టు పరిధిలోని ప్రతీ మారుమూల గ్రామములో ప్రజలకు సమాచారం అందేలా, వారిని చైతన్య పరిచేవిదంగా తగిన ప్రచారం చేయాలని, ఈ లోక్ అదాలత్ నిర్వహణను నిరంతరం, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎ.జయరాజు పర్యవేక్షిస్తూ తగిన సూచనలు అందచేస్తున్నారని, ఈ లోక్ అదాలత్ ద్వారా అధిక కేసుల పెండింగును తగ్గించటమే కాకుండా సంఘంలో ప్రజలు స్నేహ పూర్వక వాతారణం పెరుగుతుందని తెలిపి జాతీయ లోక్ అదాలత్ 28.3.2026 వరకు ప్రతీ రోజు కక్షిదారులు తమ కేసులును పరిష్కారం చేసుకునేలా వెసులుబాటు ఉంటుందని తెలిపి కార్యాక్రమములో పాల్గొన్న న్యాయవాదులకు, పోలీసువారికి తగిన సూచనలు చేసారు. ఈ సమావేశములో యాదాద్రి జూనియర్ సివిల్ జడ్జి కె.చండీశ్వరి దేవి, ఎపిపిఒ అవినాష్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీహరి, ఉపాధ్యక్షులు పెంట రమేష్, కార్యదర్శి కృష్ణయ్య, న్యాయవాదులు స్వామి, మీడియేషన్ న్యాయవాది రాజిరెడ్డి మరియు ఇతర న్యాయవాదులు, రాజపేట ఎస్.ఐ లింగారెడ్డి, యాదగిరిగుట్ట ఎస్.ఐ కృష్ణ స్వామి, లక్ష్మారెడ్డి, ట్రాఫిక్ ఎస్.ఐ. దేవేందర్, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.


# గ్రామ అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యం : అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

## రాజపేట మండలంలో వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు









**హైదరాబాద్ పల్స్ న్యూస్, మార్చి 16, యాదాద్రి భువనగిరి ప్రతినిధి :** రాజపేట మండలం లోని దూది వెంకటాపురం, రేణికుంట గ్రామంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. రాజపేట మండలం దూదివెంకాటాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కార్యక్రమాలలో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా గ్రామస్థులు సహకరించాలని కోరారు. గ్రామ సమస్యలను గ్రామ సభలోనే చర్చించి పరిష్కరించలన్నారు. గ్రామ అభివృద్ధి కోసం అధికారులు, ప్రజలు కలిసి పనిచేయాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ రాజపేట మండలంలోని రేణికుంట గ్రామంలో మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ ను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పిల్లలకు పరిశుభ్రంగా, పోషకాహారంతో కూడిన ఆహారం అందించాల్సిన అవసరం ఉందని పాఠశాల సిబ్బందికి సూచించారు. మంచి నీటి సౌకర్యాన్ని పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం మరియు చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రాజపేట మండలం రేణికుంట గ్రామంలో నర్సరీని సందర్శించి అక్కడ మొక్కల పెంపకం మరియు సంరక్షణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మొక్కలను సక్రమంగా పెంచి గ్రామాలలో విస్తృతంగా నాటే కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కల పెంపకం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి ఒక్కరూ చెట్లను నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. అనంతరం రాజపేట మండలంలోని రేణికుంట గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. గ్రామ ప్రజలకు అవసరమైన సేవలను త్వరితగతిన అందించాలన్నారు. మార్చి 31తేది లోపు వంద శాతం ఇంటి పన్ను ను వసూల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ సెక్రెటరీ కిషన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ఆస్కార్ వేదికపై కోట శ్రీనివాసరావుకు నీరాజనం...

**తెలుగు నటుడికి అరుదైన గౌరవం**


ప్రతిష్ఠాత్మక 98వ అకాడమీ (ఆస్కార్) అవార్డుల వేడుకలో తెలుగు సినీ పరిశ్రమ గర్వపడే క్షణం ఆవిష్కృతమైంది. గతేడాది దివంగతులైన సినీ ప్రముఖులకు నివాళులర్పించే 'ఇన్ మెమోరియం' విభాగంలో విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావుకు అరుదైన గౌరవం దక్కింది. ఈ నివాళి కార్యక్రమంలో ఆయన పేరును స్మరించుకోవడం తెలుగు సినిమాకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపుగా నిలిచింది.లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కోటతో పాటు బాలీవుడ్ దిగ్గజం ధర్మేంద్ర, సీనియర్ నటి సరోజాదేవి, ప్రముఖ నటుడు మనోజ్ కుమార్‌లను కూడా అకాడమీ స్మరించుకుంది. అకాడమీ అధికారిక వెబ్‌సైట్‌లోని గ్యాలరీలో ఈ నలుగురు భారతీయ తారల చిత్రాలను ప్రదర్శించి, వారి సేవలను ప్రపంచానికి గుర్తు చేసింది. భారతీయ నటుల జాబితాలో తొలుత కోట శ్రీనివాసరావు పేరును ప్రస్తావించడం విశేషం.2025 జూలై 13న కన్నుమూసిన కోట శ్రీనివాసరావు, తన అద్భుతమైన నటనతో తెలుగు చిత్ర పరిశ్రమలో చెరగని ముద్ర వేశారు. విలక్షణ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన ఆయన, తొమ్మిది నంది అవార్డులతో పాటు పద్మశ్రీ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. వీరితో పాటు బంగ్లాదేశ్ నటి జయశ్రీ కబీర్, డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకర్ ఎస్. కృష్ణస్వామికి కూడా అకాడమీ నివాళులర్పించింది.ప్రపంచ సినీ వేదికపై భారతీయ నటీనటులకు, ముఖ్యంగా తెలుగు నటుడికి ఈ స్థాయిలో గౌరవం దక్కడం పట్ల సినీ అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోట వంటి గొప్ప నటుడి సేవలను అంతర్జాతీయ వేదిక గుర్తించడం గర్వకారణమని పేర్కొంటున్నారు.

# శర్వానంద్- శ్రీను వైట్ల క్రేజీ కాంబో?

**'జార్జ్ కృష్ణ' టైటిల్‌పై ఫిల్మ్‌నగర్‌లో చర్చ**

టాలీవుడ్‌లో మోస్ట్ ప్రామిసింగ్ హీరోలలో ఒకరిగా గుర్తింపు పొందిన శర్వానంద్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఇటీవల విడుదలైన 'నారీ నారీ నడుమ మురారి' సినిమాతో డీసెంట్ హిట్ అందుకున్న ఆయన, ఇప్పుడు కొత్త ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో 'బైకర్', 'భోగి' వంటి ఆసక్తికరమైన సినిమాలు ఉన్నాయి. ఈ చిత్రాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఈ నేపథ్యంలో శర్వానంద్ మరో క్రేజీ కాంబినేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే వార్త టాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కామెడీ, కమర్షియల్ ఎంటర్టైనర్ సినిమాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు శ్రీను వైట్లతో ఆయన కొత్త సినిమా చేయనున్నట్లు సమాచారం.ఫిల్మ్ నగర్ వర్గాల సమాచారం ప్రకారం, ఇటీవల శ్రీను వైట్ల చెప్పిన కథ శర్వానంద్‌కు బాగా నచ్చిందట. దీంతో వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. ఈ సినిమా కూడా శ్రీను వైట్ల స్టైల్‌లోనే ఫుల్ ఎంటర్టైనింగ్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కనుందని టాక్ వినిపిస్తోంది. ఇదిలా ఉంటే, ఈ సినిమాకు సంబంధించిన ఒక టైటిల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అదే 'జార్జ్ కృష్ణ'. శ్రీను వైట్ల సినిమాల్లో క్యారెక్టర్ పేర్లు, టైటిల్స్ చాలా క్యాచీగా ఉండే విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమాకు కూడా ఇదే టైటిల్ ఫిక్స్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ చిత్రంలో ఒకవైపు మాస్ ఎలిమెంట్స్, మరోవైపు ఫుల్ లెంగ్త్ కామెడీ ట్రాక్ ఉండనుందని సమాచారం. శర్వానంద్ టైమింగ్‌కు శ్రీను వైట్ల మార్క్ కామెడీ కలిస్తే బాక్సాఫీస్ వద్ద నవ్వుల జాతర ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.ప్రస్తుతం శర్వానంద్ తన చేతిలో ఉన్న సినిమాల షూటింగ్స్ పూర్తి చేసే పనిలో ఉన్నారు. అవి పూర్తయ్యాక ఈ కొత్త ప్రాజెక్ట్ పట్టాలెక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. మేకర్స్ కూడా త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, ఇతర వివరాలను అధికారికంగా ప్రకటించే అవకాశముంది. ఇక దర్శకుడు శ్రీను వైట్ల కూడా ఒక బలమైన కమ్‌బ్యాక్ కోసం ఎదురు చూస్తున్నారు. దీంతో ఈ 'జార్జ్ కృష్ణ' ప్రాజెక్ట్‌పై ఇండస్ట్రీలో మంచి అంచనాలు నెలకొన్నాయి. శర్వానంద్ తన కెరీర్‌లో విభిన్నమైన పాత్రలు పోషిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నేపథ్యంలో, ఈ కొత్త పాత్రలో ఆయన ఎలా మెప్పిస్తారో చూడాలి.





# పవన్ డైలాగ్స్ చెప్పి అలరించిన శ్రీలీల, రాశీ ఖన్నా

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో హీరోయిన్లు శ్రీలీల, రాశీ ఖన్నా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. యాంకర్ సుమ వారితో చిట్ చాట్ చేస్తూ పవన్ కల్యాణ్ సినిమాలోని డైలాగ్స్ చెప్పమని కోరగా, శ్రీలీల, రాశీ ఖన్నా తమదైన శైలిలో పవన్ కల్యాణ్ డైలాగ్ చెప్పి అభిమానులను అలరించారు. యూసఫ్‌గూడలోని పోలీస్ గ్రౌండ్స్‌లో నిన్న ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈవెంట్‌లో పవన్ కల్యాణ్, దర్శకుడు హరీశ్ శంకర్, నిర్మాతలు నవీన్ యెర్నేని, వై. రవి శంకర్, యాంకర్ సుమ కనకాల పాల్గొన్నారు. కాగా, 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రాన్ని మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే ఈ సినిమాకు బెనిఫిట్ షో ప్రదర్శించుకునేందుకు అనుమతి ఇచ్చి




# "విశ్వనాథ్ & సన్స్" టీజర్ రిలీజ్

**షూటర్ జీవితంతో ప్రేమకథ కలిపి వెంకీ అట్లూరి కొత్త ప్రయోగం**

సౌత్ స్టార్ హీరో సూర్య నటిస్తున్న తాజా చిత్రం "విశ్వనాథ్ & సన్స్" పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతిభావంతుడైన దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ప్రముఖ నిర్మాత నాగవంశీ నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ సినిమాను సమర్పిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను మేకర్స్ విడుదల చేయగా, అది సోషల్ మీడియాలో మంచి స్పందనను అందుకుంటోంది. టీజర్‌ను పరిశీలిస్తే ఇది సాధారణ కమర్షియల్ సినిమా కాకుండా భావోద్వేగాలతో నిండిన స్పోర్ట్స్ డ్రామాగా ఉండబోతుందని అర్థమవుతోంది. ముఖ్యంగా ఓ షూటర్ స్పోర్ట్స్ పర్సన్ జీవితాన్ని, అతని కష్టాలు, విజయాలు, వ్యక్తిగత జీవితం చుట్టూ కథ నడుస్తున్నట్టు టీజర్‌లో చూపించారు.ఇందులో హీరో పాత్రకు గాఢమైన భావోద్వేగాలు, జీవితంలో ఎదురైన పోరాటాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ చిత్రంలో సూర్యకు జంటగా యువ నటి అమిత బైజు నటిస్తోంది. టీజర్‌లో వీరి మధ్య ఉండే ప్రేమకథ కూడా కథలో కీలక పాత్ర పోషించనున్నట్టు సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా హీరో 40 ఏళ్ల వయసులో ఎదుర్కొనే ప్రేమకథను దర్శకుడు చాలా హృద్యంగా చూపించబోతున్నట్టు టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ అంశం సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. టీజర్‌లో విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. షూటింగ్ రేంజ్‌లో జరిగే సన్నివేశాలు, స్పోర్ట్స్ నేపథ్యంతో రూపొందించిన సన్నివేశాలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. వెంకీ అట్లూరి గత చిత్రాల మాదిరిగానే ఈ సినిమాలో కూడా భావోద్వేగాలను ప్రధానంగా చూపించబోతున్నట్టు టీజర్ స్పష్టం చేస్తోంది.ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. మేకర్స్ ఇప్పటికే ఈ చిత్రాన్ని జూలైలో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. స్పోర్ట్స్, ప్రేమ, భావోద్వేగాల మేళవింపుగా తెరకెక్కుతున్న "విశ్వనాథ్ & సన్స్" సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించనుందా అనేది చూడాలి. టీజర్ మాత్రం సినిమాపై మంచి అంచనాలను క్రియేట్ చేసింది.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TELTEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com,